




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 134 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా గురువారం 26 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 134 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST THU 26 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం...
# 3 వేల లక్ష్యాలపై దాడులు

- యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ బాంబులు వేశామని వెల్లడి
- గత జూన్ సంఘర్షణ కాలం నాటితో పోలిస్తే నాలుగు రెట్లు బాంబులు వేశామని వెల్లడి
- ప్రకటించిన ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్



**పెన్ పవర్ డెస్క్:**యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్‌పై 15,000 బాంబులు వేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ, గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ బాంబులు వేశామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన సంఘర్షణ సమయంలో కంటే నాలుగురెట్లు బాంబులు ఉపయోగించినట్లు తెలిపారు.

- మిగతా2లో

## ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీ వసూలు చేయొద్దు
### హెటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

- ఎల్పీజీ గ్యాస్ కొరతపేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నాయన్న సీసీపీఏ
- హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు, మీడియాలో కథనాలు వచ్చినట్లు వెల్లడి
- అదనంగా ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్న కేంద్రం

- మిగతా2లో



## పర్యాటకుల కోసం హోటల్ గదులు,
# హోమ్ స్టేలను పెంచండి

- పర్యాటక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పర్యాటకులు మరింత పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్న ముఖ్యమంత్రి
- కారావాన్ పార్కులు, టెంట్ సిటీల ఏర్పాటుకు చర్యలు
- పర్యాటక ప్రోత్సాహకానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అలాగే వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటులోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు.క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సహా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు.కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు.

అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

- మిగతా2లో

## చంద్రబాబుకు
# భయపడొద్దు..
### ఆ రోజులు పోయాయి: జగన్

- అద్దంకి నియోజకవర్గ వైసీపీ నేతలతో జగన్ సమావేశం
- ప్రతి విషయంలో క్రెడిట్ చోరీ చేస్తున్నారని విమర్శ
- మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజ కవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు.ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా

- మిగతా2లో





## జగన్ జీవితం జంగిల్
# బుక్ లాంటిది

- అరాచకం, అబద్ధాలే తప్పించి వాస్తవాలు ఏనాడూ మాట్లాడలేదని విమర్శ
- అసెంబ్లీకి రాకుండా బయట విమర్శలు చేయడం జగన్ బలహీనతకు నిదర్శనమని వ్యాఖ్య
- వేగంగా జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని ఆగ్రహం

- మిగతా2లో

## అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..
### డయాగ్రిడ్ టెక్నాలజీతో అద్భుత నిర్మాణం



- అమరావతిలో వేగం పుంజుకున్న ఐకానిక్ టవర్ల పనులు
- హెచ్ఓడీ టవర్-3 వద్ద 'కార్నర్ నోడ్' అమర్చే పనులను ప్రారంభించిన నారాయణ
- అమరావతి నిర్మాణానికి ప్రజల పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని వెల్లడి

- మిగతా2లో

## ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో
# ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

- ముఖ్యమంత్రి సమక్షంలో కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం
- తెలుగు రుచులను ప్రపంచానికి పరిచయం చేయడంలో వర్సిటీ సహకారం
- ఏపీని కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి దోహదపడనున్న ఎంఓయూ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి

- మిగతా2లో



## 'వందేమాతరం' పాడటం
# తప్పనిసరి కాదు



- 'వందేమాతరం' సర్క్యులర్‌ను సవాలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఆదేశాలు కేవలం సలహా మాత్రమేనని, తప్పనిసరి కాదని చెప్పిన సుప్రీంకోర్టు
- ప్రభుత్వ సర్క్యులర్‌లో శిక్షార్హమైన చర్యలు లేవని స్పష్టం చేసిన ధర్మాసనం
- పరోక్ష ఒత్తిడి ఉంటుందన్న పిటిషనర్ వాదనలు ఊహాజనితమన్న కోర్టు
- దేశభక్తిని బలవంతం చేయలేరని వాదించిన సీనియర్ న్యాయవాది

- మిగతా 2లో




## భాగ్యనగరంలో ప్రయాణికులకు
# ఆర్టీసీ శుభవార్త

- మెట్రో, ఏసీ డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ
- పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో ప్రయాణికులకు ఊరట
- ఆర్టీసీ బస్సులు ఉండగా పెట్రోల్ కష్టాలు దండుగ అంటూ ఆర్టీసీ ఎండీ ఆసక్తికర వ్యాఖ్య

- మిగతా2లో

# అమెరికా విమాన వాహకనౌక లక్ష్యంగా క్షిపణి దాడులు చేశాం

### హెచ్చరించిన ఇరాన్ ప్రకటన

- యూఎస్ఎస్ అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడి
- విమాన వాహన నౌక కదలికలను పరిశీలిస్తున్నామని అంతకుముందే ఇరాన్ ప్రకటన
- ఆ తర్వాత గంటలోపు క్షిపణితో దాడి చేసిన ఇరాన్

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

## యూరియాపై పశ్చిమాసియా ప్రభావం

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా నిల్వలు తగినంతగా ఉన్నాయని, వ్యవసాయానికి ఎలాంటి ఆటంకం ఏర్పడదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పరిస్థితులు అనూహ్యంగా ఉంటున్నాయి. మార్చి 10 నాటికి భారత్‌లో యూరియా నిల్వలు 61.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయని, అంటే గత ఏడాది ఇదే సమయంలో ఉండే నిల్వల కన్నా 10 లక్షల టన్నుల వరకు అధికంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ వాణిజ్యాన్ని అల్లకల్లోలం చేస్తోం ది. ఈ సంక్షోభం వ్యవసాయానికి ప్రధాన అవసరమైన యూరియా తయారీకి కావలసిన లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ద్రవీకృత సహజవాయువుఎల్ఎన్‌జి) సరపరాపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. యుద్ధం ప్రకంపనలు ఇప్పటికే భారత్ యూరియా సరఫరాను దెబ్బతీస్తున్నాయి. ఆదివారం (మార్చి 22) నాటికి భారత్ లోని యూరియా ప్లాంట్లు సగం సామర్థ్యంతో నడుస్తున్న పరిస్థితి ఏర్పడింది. కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. భారత్ అతిపెద్ద ఎల్ఎన్‌జి దిగుమతిదారైన పెట్రోనెట్ ఎల్ఎన్‌జి సంస్థ ఖతార్ నుండి దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా గ్యాస్ సరఫరాను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. ఇటీవల ఖతార్‌లోని రాస్‌లాఫాన్‌లో యుద్ధంవల్ల గ్యాస్ సరఫరా వ్యవస్థకు నష్టం జరగడంతో ఒప్పందం ప్రకారం సరఫరా చేయలేనని పెట్రోనెట్ చేతులుఎత్తేసింది. ఈ చర్య కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం లోని గెయిల్ (ఇండియా), ఇండియా ఆయిల్ కార్పొరేషన్ సంస్థ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి గ్యాస్ పంపిణీదారుల ద్వారా సరఫరా కోతకు దారి తీసింది. ఎల్ఎన్‌జి సరఫరా కోసం భారత్ భారీగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్ రోజూ 4.7 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును, అంటే తన అవసరాల్లో 88%, అలాగే 47% సహజవాయు డిమాండ్ కోసం ద్రవీకృత సహజవాయువును విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరగడమే కాకుండా ఎరువులపై భారత ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై కూడా ప్రభావంపడే అవకాశం కనిపిస్తోంది. యూరియా కొరతవల్ల వ్యవసాయ ఉత్పాదక ఖర్చులు పెరగడమే కాకుండా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. 2025లో అంతర్జాతీయ మార్కెట్ నుంచి 50% పైగా సహజవాయువు (ఎల్ఎన్‌జి)ను భారత్ దిగుమతి చేసుకుంది.

ప్రపంచం మొత్తంమీద భారీస్థాయిలో ఎల్ఎన్‌జి నాలుగో కొనుగోలుదారు భారత్‌యే. 2025లో 261 లక్షల మెట్రిక్ టన్నుల ఎల్ఎన్‌జిని భారత్ దిగుమతి చేసుకుంది. ఇందులో 40% ఖతార్ నుంచి మిగతా 20% యుఎఇ, ఒమన్ ద్వారా సరఫరా అవుతుంది. ఈ ఎల్ఎన్‌జి అంతా హోర్ముజ్ జలసంధి ద్వారానే నౌకల మీదుగా రవాణా అవుతుంది. మొత్తం మీద భారత్ దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జి 60% వరకు హోర్ముజ్ జలసంధి మూసివేయడంవల్ల అంతరాయం ఏర్పడుతోంది. భారత్‌లో అమోనియా తయారీకి తద్వారా ఎరువుల తయారీకి ప్రధానంగా సహజవాయువునే వినియోగిస్తుంటారు. 2026లో భారత్‌కు సరఫరా అయిన ఎల్ఎన్‌జిలో 30% ఎరువుల తయారీకే వినియోగం కావడం గమనార్హం. యూరియా ఉత్పత్తికి ఎల్ఎన్‌జి ప్రధాన వనరు. దేశంలో ఎరువులుగా యూరియానే ఎక్కువగా వాడుతుంటారు. యూరియా ఉత్పత్తి అత్యంత ఇంధన వినియోగతో కూడిన ప్రక్రియ. ఈ యూరియా ప్లాంట్లు తక్కువ ఉద్గారాలను విడుదల చేసే సహజవాయువు వినియోగంలోకి మారాయి. జాతీయ స్థాయిలో యూరియా వినియోగం గత దశాబ్దకాలంలో క్రమంగా పెరిగి 2025లో 387 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. 2025లో స్వదేశీ యూరియా ఉత్పత్తి కూడా దాదాపు 306 లక్షల మెట్రిక్ టన్నుల వరకు జరిగినా దేశం మొత్తం మీద డిమాండ్‌ను నెరవేర్చలేకపోతోంది. అందువల్ల భారత్ యూరియా దిగుమతులపై ఆధారపడవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం స్వదేశీ యూరియా ఉత్పత్తిని, సరఫరాను దెబ్బతీస్తోంది. 2025లో భారత్ యూరియా దిగుమతులు 2300 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయి. ఈ దిగుమతుల్లో 71% పశ్చిమాసియా నుంచి రావలసి ఉండగా, ఇందులో 45% ఒమన్, సౌదీఅరేబియా, ఖతార్, యుఎఇ నుంచి సరఫరా అవుతుంటాయి. ఈ మొత్తం సరఫరా హోర్ముజ్ జలసంధిద్వారా రవాణా కావలసి ఉంది. ఈ నేపథ్యంలో సహజవాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వు 2026ను భారత ప్రభుత్వం జారీ చేసింది. ఇందులో ఎరువుల రంగాన్ని ప్రాధాన్యత జాబితాలో చేర్చింది. రెండు మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించినప్పుడు కూడా ఇంధనం, ఎరువుల సరఫరా విషయంలో కూడా భారత్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఎరువుల తయారీకి ప్రాధాన్యం ఇచ్చి స్వదేశీయంగా సబ్సిడీ ధరకు గ్యాస్ లభిస్తేనే ఎరువులు ఉత్పత్తి అవుతాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల కూడా పొటాష్ సరఫరా దెబ్బతింది. ప్రపంచ దేశాలకు సరఫరా అయ్యే యూరియాలో 14% ఒక్క రష్యా నుంచే సరఫరా అవుతోంది. డిఎపిలో రష్యా సరఫరా దాదాపు 10% వాటాతో రెండో ఉత్పత్తిదారుగా రష్యా ఉంటోం ది. పొటాష్‌లో కావలసినవి 50% రష్యా, బెలారస్ నుంచే రప్పించుకోక తప్పదు. భారత్ డిఎపి డిమాండ్‌లో దాదాపు 60% చైనా, సౌదీఅరేబియా నుంచే లభిస్తోంది. ఇప్పుడు సౌదీఅరేబియా కూడా యుద్ధ బాధిత దేశంగా ఉండడంతో డిఎపి సరఫరా దెబ్బతింటోంది. భారతదేశానికి సరఫరాలో ఇబ్బందులే కాకుండా దిగుమతుల వ్యయం బిల్లుకూడా అమాంతంగా పెరిగే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందని వాణిజ్యవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

# పర్యాటకుల కోసం హోటల్ గదులు, హోమ్ స్టేలను పెంచండి

- మొదటి పేజి తరువాయి

గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరఘాట్‌ను ఆగస్టు నాటికి, హావ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.

**పర్యాటక ప్రోత్సాహానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ**

రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరు శాఖల సమన్వయం కోసం సీఎస్ అధ్యక్షతన దీనిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హౌస్ బోట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్‌లను కూడా ప్రోత్సహించాలని అన్నారు. విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరోడ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలన్నారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్ద ఎత్తున ఆకర్షితులు అవుతారన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్సహిస్తే అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. క్రియేటివ్ ఎకనామినీ ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్ద ఎత్తున జరగాలన్నారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలన్నారు.

బాలివుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకనామీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని.. ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్ కు రూ.500 కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92 కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని, ఈ ఏడాదిలో 9 నెలల కాలానికి గానూ 21 శాతం మేర వృద్ధి కనిపించిందని, ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు, విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీ వసూలు చేయొద్దు

### హెటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

హోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎల్పీజీ పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. గ్యాస్ కొరతను చూపిస్తూ అదనపు సేవల ఛార్జీ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పేరుతో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీసీపీఏ స్పందించింది. ఎల్పీజీ గ్యాస్ పేరుతో కొన్నిహోటళ్లు, రెస్టారెంట్లు వినియోగదారుల నుంచి అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది. హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు వచ్చాయని, మీడియాలో కూడా వార్తలు వచ్చాయని వెల్లడించింది. మెనూలో పేర్కొన్న ధరలను మాత్రమే వసూలు చేయాలని, అదనంగా ఎలాంటి చార్జీలు ఉండకూడదని స్పష్టం చేసింది.

## జగన్ జీవితం జంగిల్ బుక్ లాంటిది

వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జీవితం 'జంగిల్ బుక్'లా మారిందని ఆంధ్రప్రదేశ్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి విమర్శించారు. అరాచకం, అబద్ధాలు తప్పించి వాస్తవాలను ఏనాడూ మాట్లాడని నాయకత్వం ఆయనదేనని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు, ప్రజా ధనం దోపిడీ చేసి రాష్ట్రాన్ని దెబ్బతీశాడని ఆరోపించారు. అందుకే ప్రజలు ఆయనకు గట్టి బుద్ధి చెప్పి కేవలం 11 అసెంబ్లీ సీట్లకే పరిమితం చేశారని అన్నారు. ప్రజా తీర్పును గౌరవించకుండా, అసెంబ్లీకి రాకుండా బయట విమర్శలు చేయడం ఆయన బలహీనతకు నిదర్శనమని అన్నారు. గతంలో ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్, హెచ్‌ఎస్‌బీసీ, ఐబీఎం వంటి ప్రముఖ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసింది నాటి జగన్ ప్రభుత్వమేనని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ పరిస్థితులను మార్చి గూగుల్, టీసీఎస్, అర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్, ఐబీఎం వంటి ప్రతిష్ఠా త్మక సంస్థలను రాష్ట్రానికి తీసుకువస్తోందని పేర్కొన్నారు. ఇది తమ ప్రభుత్వంపై పెట్టుబడిదారుల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనమని మంత్రి అన్నారు. జగన్ పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తూ పెట్టుబడులకు స్వర్గధామిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతోందని అన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, యువతకు లభిస్తున్న ఉపాధి అవకాశాలు, వేగంగా జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. అందుకే ప్రతిసారి గుమ్మం కూడా దాటకుండా ఇంట్లో ప్రెస్ మీట్ ద్వారా లేదా తన పార్టీ నేతలతో సమావేశమై కూటమి ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకొని పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, దుష్ప్రచారాలు చేసినా ప్రజలు తమ ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని ఏమాత్రం దెబ్బతీయలేరని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దృఢంగా ముందుకు సాగుతుందని జనార్ధన్ రెడ్డి అన్నారు.

## అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..

రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులందరూ ఒకే చోట కొలువుదీరేలా నిర్మిస్తున్న ఐదు ఐకానిక్ టవర్ల పనులు వేగవంతమయ్యాయి. ఈరోజు హెచ్‌ఓడీ టవర్-3 వద్ద 'కార్నర్ నోడ్' అమర్చే పనులను మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యాధునిక డయాగ్రిడ్ సాంకేతికతతో ఈ భవనాలను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అమరావతి నిర్మాణానికి ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు రూపొందించిన ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ద్వారానే ఈ నిధులు సమకూరుతున్నాయని, అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ' అని ఆయన గుర్తు చేశారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల సుమారు 4 నెలల పాటు పనులకు అంతరాయం కలిగిందని, ఇప్పుడు పనుల వేగాన్ని పెంచామని తెలిపారు. ఐకానిక్ భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారుల నివాస సముదాయాల పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని వివరించారు.

రాయపూడి వద్ద జరిగిన అగ్నిప్రమాదంపై సీఎం ఇప్పటికే సమీక్షించారని, ఒకవేళ ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ ప్రమాదానికి పాల్పడి ఉంటే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రస్తుతం దీనిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోందని చెప్పారు.

**డయాగ్రిడ్ టెక్నాలజీ అంటే ఏమిటి?**

ఈ టవర్ల నిర్మాణంలో వాడుతున్న డయాగ్రిడ్ టెక్నాలజీ వల్ల భవనానికి లోపల పిల్లర్లు ఉండాల్సిన అవసరం తక్కువగా ఉంటుంది. దీనివల్ల లోపల స్థలం ఎక్కువగా లభిస్తుంది. ఉక్కును త్రిభుజాకారపు గ్రిడ్లుగా అమర్చడం వల్ల భవనానికి అద్భుతమైన పటుత్వంతో పాటు ఒక ఆధునిక లుక్ వస్తుంది.

# 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు

ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది. భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది.

పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు.

అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని,

చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం... 3 వేల లక్ష్యాలపై దాడులు

- మొదటి పేజి తరువాయి

ఇరాన్‌లోని 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు తెలిపారు. అయితే ఇరాన్‌పై దాడిని ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ చెబుతోంది.

## చంద్రబాబుకు భయపడొద్దు..

- మొదటి పేజి తరువాయి

చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీకి మంచి పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, గతంలో తాము పదవులు, కాంట్రాక్టుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు చట్టసభల్లో కూడా మన మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

## భాగ్యనగరంలో ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

భాగ్యనగరంలో ప్రయాణికులకు టీజీఎస్‌ఆర్టీసీ శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నగర పరిధిలోని మెట్రో, ఏసీ డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ కొరత వార్తల నేపథ్యంలో ప్రయాణికులకు ఆర్టీసీ ఊరటనిచ్చే వార్త చెప్పింది.

ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి స్పందిస్తూ, "పెట్రోల్ కష్టాలు పడటం ఎందుకు దండగ, ఆర్టీసీ బస్సులు ఉండగ" అంటూ వ్యాఖ్యానించారు. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరవద్దని, సురక్షితంగా బస్సులోనే ప్రయాణించాలని సూచించారు.

## అమెరికా విమాన వాహకనౌక లక్ష్యంగా క్షిపణి దాడులు చేశాం

ఇరాన్‌పై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించిన రెండు రోజుల అనంతరం, అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడులు చేసింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వం ప్రకటన చేసింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక వైపు తాము క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసింది. దీనిని అమెరికా ధృవీకరించవలసి ఉంది. ఈ విమాన వాహక నౌక కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నామని, దానిని లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ఆ తర్వాత గంటలోపు క్షిపణి దాడి జరగడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియోను ఇరాన్ మీడియా విడుదల చేసింది. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ఇదివరకు కూడా ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దీనితో అది పని చేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల ఇరాన్ ప్రకటించగా, అమెరికా తోసిపుచ్చింది.

## ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

- మొదటి పేజి తరువాయి

చంద్రబాబునాయుడు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు-ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌లు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ ఎంఓయూ తోడ్పడనుంది. ప్రత్యేకించి కలినరీ విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్.బి.ఐ వ్యక్తిగత ప్రమాద బీమా క్లెయిమ్ చెల్లింపు

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 25:** జగ్గంపేట మెయిన్ బ్రాంచ్ (02731)కు చెందిన ఖాతాదారునికి సంబంధించిన రూ.40లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా క్లెయిమ్ మొత్తాన్ని వారి నామినీ కె.కనక మహాలక్ష్మికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుని రీజనల్ మేనేజర్ డి.ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జగ్గంపేట చీఫ్ మేనేజర్ ఎస్. నవీన్ కుమార్, ఎస్.బి.ఐ జనరల్ ఇన్సూరెన్స్ సి ఎస్ ఏం ఎ. శ్రీనివాస్, బి డి ఏం వి. ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రతి ఖాతాదారుడు తమ ఖాతాకు వ్యక్తిగత ప్రమాద బీమా కలిగి ఉండటం ఎంత అవసరమో అధికారులందరూ వివరించారు. ఆపద సమయంలో ఈ బీమా కుటుంబానికి ఎంతటి ఆర్థిక భరోసానిస్తుందో ఈ క్లెయిమ్ చెల్లింపు ద్వారా నిరూపితమైందని వారు తెలియజేశారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## డ్రైవర్స్ కాలనీలో స్థలాలు అర్హులకే ఇస్తాం



జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 25:** జగ్గంపేటలోని డ్రైవర్స్ కాలనీలో స్థలాలను నిజమైన అర్హులకే ఇస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు. బుధవారం జగ్గంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2010లో డ్రైవర్స్ కాలనీలో స్థలాలు పొందిన అర్హుల స్థలాలకు ఎటువంటి ఇబ్బంది లేదని కానీ రియల్ ఎస్టేట్ చేసుకునేవారికి ఇక్కడ స్థలం ఉంటే ఆ స్థలాలను రద్దు చేసి అర్హులకు పంచి పెడతామన్నారు. మాజీ మంత్రి తోట నరసింహం అవగాహన రాయిత్యంతో మాట్లాడారని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఆయన వాస్తవాలను మరిచి మాట్లాడడం జరిగిందని డ్రైవర్స్ కాలనీ లో పేదల పట్టాలను రద్దు చేయొద్దని అనడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు చిన్న కాలనీ అయినటువంటి డ్రైవర్స్ కాలనీకే మౌలిక వసతులు కల్పించ లేకపోయారంటే వారి యొక్క పరిపాలన ఏ విధంగా సాగిందో ఒక్కసారి గ్రహించాలని ఆయన అన్నారు. అక్కడ నిజమైన లబ్ధిదారులు ఎంతమందో, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎంతమంది ఉన్నారో నాకు తెలుసునని 2000 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యేగా నేను అక్కడ డ్రైవర్లకు ఇళ్ల స్థలాలు ఇస్తే 2010లో అక్కడ ఇల్లు నిర్మించుకోలేదని నెపం పెట్టి అప్పటి పట్టాలు రద్దుచేసి 2010 మంత్రిగా తోట నరసింహం ఆయనకు నచ్చిన వారికి పట్టాలు ఇష్యూ చేయడం జరిగిందని, 2000 సంవత్సరంలో మేము ఇచ్చిన లబ్ధిదారులు అందరూ వీధిన పడ్డారని నెహ్రూ అన్నారు. అక్కడ అర్హులైన లబ్ధిదారులతో పాటు పేదవారు ఎవరైనా స్థలాలు కొనుగోలు చేసినట్లయితే వారికి కూడా న్యాయం చేసి వారందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వడం మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు మా కార్యకర్తల కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలం ఇచ్చి తీరతానని జ్యోతుల నెహ్రూ అన్నారు. వాస్తవాలు గ్రహించి మాట్లాడాలని మాజీ మంత్రి తోట నరసింహంకు హితువు పలికారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, పిల్లా చంటిబాబు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, ఘాజింగం సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, పోసిన ప్రసాద్, గల్లా రాము తదితరులు పాల్గొన్నారు .

# ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు.



భూ ఆక్రమణల పట్ల స్పందించని అధికారులు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 25:** ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని సిపిఐ ఎంఎల్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఏ అధికారి భూ ఆక్రమణ పై చర్యలు తీసుకునేందుకు ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో భూ ఆక్రమణను నిరసిస్తూ గణేష్ ఆధ్వర్యంలో గిరిజన సంఘం ప్రభుత్వ భూమి ధనాల కొండ వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో గణేశ్వరరావు మాట్లాడుతూ యర్రవరం పరిధిలోని ప్రభుత్వ భూమి ధనాల కొండ సర్వే నెంబర్ 366 లో 42.65 సెంట్లు భూమిని బాంబు బ్లాస్టింగ్ తో పేల్చి ఆక్రమించుకుంటున్న భూస్వామి పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పూర్వం చరిత్ర కలిగిన హైవేను ఆనుకుని ఉన్న ప్రభుత్వ ధనకొండను నిబంధనలకు విరుద్ధంగా బాంబులు తో పెట్టి బ్లాస్టింగ్ చేస్తున్నా భూస్వామి పై మండల రెవెన్యూ అధికారులు గానీ, జిల్లా మైనింగ్ అధికారులుగానీ, సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు గాని ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని గణేష్ ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార దర్పం ఉన్న నాయకుల అండదండలతో ప్రభుత్వ భూమిని భూస్వామి ఆక్రమించుకుంటుంటే , ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకో లేకపోతే ప్రజలకు ప్రభుత్వంపై, అధికారులపై విశ్వాసం ఏముంటుదని ప్రశ్నించారు? ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు ప్రభుత్వ భూమిని (ధనకొండను) ఆక్రమించుకుంటున్న భూస్వామిపై చట్టపరమైన తగిన చర్యలు తీసుకోవాలని, ఎంతో చరిత్ర కలిగిన శైవ, బౌద్ధ మతాల ఆనవాళ్లు ఉన్న పురావస్తు శాఖ ఆధీనం లో ఉన్న ధనాల కొండకు రక్షణ వలయం ఏర్పాటు చేయాలని సిపిఐ ఎంఎల్ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మండల కార్యదర్శి గండేటి పెదనాగమణి,గిరిజన సంఘం నాయకులు సోమల కుశల, మాడెం బాబురావు, వల్లి కొండలరావు, కందుల క్రాంతి కుమార్, కందుల కృపా ప్రసాద్, పడాల తాతారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.1.82 కోట్లు





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 25:**కొనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో గణనీయమైన ఆదాయం నమోదైంది.ఈ లెక్కింపులో మొత్తం రూ.1,82,94,288 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు.ఆలయ ప్రధాన హుండీతో పాటు శ్రీ విశ్వేశ్వర స్వామివారి హుండీల నుంచి రూ.1,47,36,474 నగదు లభించగా, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.35,57,814 సమకూరినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని 27 రోజుల కాలానికి సంబంధించినదిగా అధికారులు పేర్కొన్నారు.భక్తులు సమర్పించిన కానుకల్లో 19 గ్రాముల బంగారం, 860 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 12 దేశాలకు చెందిన 51 విదేశీ కరెన్సీ నోట్లు కూడా హుండీలో కనిపించాయి.

హుండీ లెక్కింపు కార్యక్రమం దేవస్థాన చైర్మన్ ముదునూరి వెంకటరాజు,కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో సక్రమంగా నిర్వహించారు.

అలాగే అసిస్టెంట్ కమిషనర్ జిల్లా దేవదాయ శాఖ అధికారి వి. సత్యనారాయణ, తనికీదారు ఎస్.టి.పి.టి. శ్రీనివాస్, ఈఓ గ్రూప్-2 పి.వి.వి.ఎస్. కామేశ్వరరావు, ఈఓ గ్రూప్-3 బి. కిరణ్ తదితరులు హాజరయ్యారు. అర్చకులు, వేదపండితులు, భక్తులు,పోలీసులు, శ్రీవారి సేవకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. రావులపాలెంలోని కరూర్ వైశ్య బ్యాంక్, కెనరా బ్యాంక్ ప్రతినిధులు కూడా లెక్కింపులో పాల్గొన్నారు.



## దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం




**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 25:** దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బహుజన సమాజ పార్టీ కాకినాడ జిల్లా అడ్వైజర్ మరియు జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి జుత్తుక నాగేశ్వరరావు అన్నారు.

జగ్గంపేటలో అయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు భారత రాజ్యాంగం ఆర్టికల్ 15 మరియు ఆర్టికల్ 25 నేరుగా ఉల్లంఘిస్తున్నదన్నారు.


ఆర్టికల్ 15 ప్రకారం మతం ఆధారంగా వివక్షత చూపరాదని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. అలాగే ఆర్టికల్ 25 ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని స్వీకరించొచ్చని రాజ్యాంగంలో స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తి మతమార్పిడి చేసుకున్న కారణంగా ఆ వ్యక్తికి లభించే సామాజిక రక్షణలను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. మత స్వేచ్ఛను కుల హక్కులతో అనుసంధానం చేయడం సరైన పద్ధతి కాదు అని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ తీర్పుపై సమగ్ర విచారణ కేంద్ర ప్రభుత్వం తీసుకుని దళిత క్రైస్తవులకు న్యాయం జరపాలని జుత్తుక నాగేశ్వరరావు కోరారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఈవీఎం, వీవీప్యాట్ గోదాము వద్ద నిరంతర పర్యవేక్షణ

- జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 25:** ఈవీఎం, వీవీప్యాట్ల గోదాముకు పకడ్బందీ భద్రత కల్పించడం జరిగినప్పటికి నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధి కారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి అదేశించారు. బుధవారం స్థానిక ఎయిమ్స్ కళాశాల మూడో అంతస్తు నందు భద్రపరిచిన ఈవీఎం వివి ప్యాట్ గోదాములను ఆమె భారత ఎన్నికల సంఘం నిబంధన లకు అనుగుణంగా రెవెన్యూ పోలీస్ అగ్నిమాపక భద్రతా సిబ్బంది రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ నిర్వహించారు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు, మార్గదర్శకాల కు అనుగుణంగా సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీ లించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రప రుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవి ధం గా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నూ మూడు నెలలకు ఒక సారి (త్రైమాసిక) తనిఖీలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వ హిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని జిల్లా జాయిం ట్ కలెక్టర్ అధికారులకు సూచిం చారు. ఎన్నికల కమిషన్ మార్గ దర్శకాలు ప్రకారం మూడు నెలల తనిఖీల్లో భాగంగా ఈవీఎం భద్రపరిచిన గోడౌన్ భద్రతకు తీసుకుంటున్న చర్యలను ఆమె పరిశీలించారు అదేవిధంగా సీసీ కెమెరాలు వ్యవస్థను ఫైర్ సేఫ్టీ 24 గంటలు భద్రత ఏర్పాట్లను జెసి స్వ యంగా పరిశీలించి పలు సూచనలు చేశారు ఈవీఎం భద్రత లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని భద్రత నిబంధనలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో జిల్లా జాయింట్ కలెక్టర్ తో పాటు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున వడ్డీ నాగే శ్వరరావు తెలుగుదే శం పార్టీ తరపున డి రమణ కుమార్ ఉప తాహ సిల్దార్ శివరాజ్ సిబ్బంది బాబ్జి తదితరులు పాల్గొన్నారు



## గ్రామ నీటి భద్రతపై శిక్షణ కార్యక్రమం

- ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 25:**మండల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ నీటి భద్రత గ్రామ స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ, నీటి నాణ్యత పరీక్షలు, నీటి వృథా నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో నీటి భద్రత సాధించాలంటే ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. చెరువులు, బోర్లు, పైపులైన్లు తదితర తాగునీటి వనరులను సంరక్షించడంలో ప్రతి కుటుంబం బాధ్యత వహించాలన్నారు.అలాగే నీటి వినియోగంలో మితవ్యత పాటించడం, కాలుష్యాన్ని నివారించడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలను అలవాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కె. రమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఓ, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామస్వరూప్, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## తామరాడలో శ్రీ సీతారాముల ఆలయానికి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం.



**కిర్లంపూడి,పెన్ పవర్ మార్చి25:**కిర్లంపూడి మండలం తామరాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీసీతారాములు వారి ఆలయానికి సంబందించిన షాపింగ్ కాంప్లెక్స్ ను గ్రామ సర్పంచ్ తోట అయ్యన్న బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తోట అయ్యన్న మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వల్ల ఆలయానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోకాడ రాజా, టీడీపీ నాయకులు అనుకుల శ్రీకాంత్, పంచాది నానాజీ, గ్రామా పెద్దలు పెదిరెడ్డి రాంబాబు,పెదిరెడ్డి లక్ష్మణ్, గంధం బాబి,వీరబాబు, పాబోలు కృష్ణ, కమిటీ సభ్యులు ముచ్చకర్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో పెట్రోల్ బంకులు మూసివేత.

- పట్టణంలో ఒకే ఒక బంకు వద్ద పెట్రోల్ కోసం ప్రజల వెంపర్లాట.
- పెట్రోల్ బంక్ వద్ద క్యూ లైన్లో జనం.






**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 25:** రానున్న రోజుల్లో చుక్క పెట్రోలు కూడా దొరకదనే పుకార్లు షికార్లు చేయడంతో ప్రజలు పెట్రోల్ బంకులకు భారీగా జనం తరలివస్తున్నారు. గత రెండు రోజులుగా బంకుల వద్ద తీవ్ర రద్దీ నెలకొంది. ఇటీవల గల్ఫ్ లో యుద్ధం కొనసాగుతూ ఉండటంతో వివిధ మీడియాల్లో బ్రేకింగ్ న్యూస్ చూస్తున్న ప్రజలు ఒక అవగాహనకు వచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆయిల్ కొరత లేదని పదేపదే ప్రచార మాధ్యమాల ద్వారా వివరిస్తున్నప్పటికీ, విశ్లేషకుల అంచనాలను పరిగణలోకి తీసుకుని సామాన్య ప్రజానీకం పెట్రోల్ డీజిల్ కొరత భారీగా ఏర్పడుతుందని, ఇబ్బడి ముబ్బడిగా ఊహించని స్థాయిలో పెట్రోల్, డీజిల్ రేట్లు పెరుగుతాయని అంచనా కు వచ్చారు. దీంతో మోటర్ బైక్ లు పెట్రోల్ బంక్ లకు క్యూ కట్టాయి. లారీలు, ఆటోలు ఫుల్ ట్యాంకులు తీసుకోవడంతో పాటు అదనంగా బ్యారల్ లలో నింపుకొని తరలిస్తున్నారు. ఇది చాలదన్నట్లు సామాన్య జనులు రానున్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకొని బ్యాగ్లో క్యాన్ల ను పట్టుకొని గంటల తరబడి క్యూ లైన్లో పెట్రోల్ కోసం నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంకాలానికి ఏలేశ్వరం పట్టణం, రూరల్ పరిధిలో ఉన్న బంకులన్నీ పెట్రోల్ డీజిల్ నిల్వలు లేక మూతపడ్డాయి. పట్టణంలో గొల్లాజీ పెట్రోల్ బంక్ ఒకటే పనిచేస్తుంది. మిగతా బంకులన్నీ మూతపడడంతో పెట్రోల్ కోసం ప్రజలు వెంపర్లాడుతున్నారు. బంకులు మూతపడం ప్రజల అంచనాలకు ఊతమిచ్చి నట్లయ్యింది. పట్టణంలో బంక్ యజమాని పెట్రోల్ డీజిల్ కు కొరతలేదని ప్రజలు ఎవరు కంగారు పడవద్దని, ప్రస్తుతానికి రేట్లు ఏమీ పెరగటం లేదని ప్రజలకు ఎంత నచ్చ జెప్పినప్పటికీ ప్రయోజనం లేదు. అవసరానికి మించి వినియోగదారులు పెట్రోల్ డీజిల్ నిల్వలను ఇళ్లల్లోనే ఉంచుతున్నారు. పెట్రోల్ ఇళ్లల్లో అధిక నిల్వలు ఉంచితే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే అని పలువురు మేధావులు హెచ్చరిస్తున్నారు.

# పైప్‌లైన్ గ్యాస్ సరఫరా విధి విధానాలు ప్రయోజనలపై సమీక్ష



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 25:** ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలను నేపథ్యంలో ఎల్పి జి గ్యాస్ తక్కువగా లభ్యం అవుతున్న పరిస్థితిని అధిగ మించేందుకు ప్రత్యామ్నా యంగా పైపుల ద్వారా నేరుగా గ్యాస్ ఇంటికి వచ్చే విధానాన్ని ప్రోత్సాహించాలని జిల్లాలో ఇప్పటికే వున్న గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్
వారి పైప్ లైన్ గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింతగా విస్తృతము మరియు పటిష్ఠము చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి ఆదే శించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జీవో నెంబర్ 8 ప్రకారం నియమితమైన జిల్లా స్థాయి యుటిలిటీ కమిటీ
సభ్యులతో గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా పైప్‌లైన్ గ్యాస్ సరఫరా విధి విధానాలు ప్రయోజ నాల గురించి జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సమీ క్షించారు జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయ భాస్కర్ సమన్వయ అధికారిగా నియమింపబడ్డారు అని అన్ని శాఖలను సమన్వయ పరిచి ఈ ప్రభుత్వ ఆదేశాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.
ముందుగా గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీ దుర్గా మాట్లాడుతూ కనెక్షన్ పొందే విధానం, దరఖాస్తు సమర్పించాల్సి న పత్రాలు తదుపరి సర్వే కంపెనీ ప్రతినిధులు ఆ యొక్క ఇంటిని సంద ర్శించి పైప్‌లైన్ వేయడానికి వీలవుతుందో లేదో సర్వే చేస్తారన్నారు.సరఫరా మౌలిక సదుపాయాలు, ఇంటి వెలుపల ఒక గ్యాస్ మీటర్ అమర్చబడుతుం దనీ. ఎంత గ్యాస్ ఉపయో గిస్తారో దానికి మాత్రమే బిల్లు చెల్లించాల్సి ఉంటుం దన్నారు. పటిష్టమైన పైపు ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు సిలిం డర్ల మాదిరిగా అయిపో తుందనే భయం ఉండదని 24/7 అందుబాటులో ఉంటుందన్నారు. సిలిండర్ తో పోలిస్తే పైప్ లైన్ గ్యాస్ చాలా సురక్షితమన్నారు. గ్యాస్ లీక్ అయిన గాలి కంటే తేలికగా ఉండటం వల్ల త్వరగా గాలిలోనికి కలిసి పోవడం వల్ల పెద్దగా ప్రమాదం ఉండదన్నారు సాధారణ ఎల్పిజి సిలిండర్ల కంటే ఇది సుమారు 20% నుండి 30% వరకు తక్కు వ ధరకు లభిస్తుందన్నారు సిలిండర్ బుకింగ్ చేసుకో వడం, వచ్చే వరకు వేచి చూడటం వంటి ఇబ్బందు లు ఉండవన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మీటర్ రీడింగ్ ఆధారంగా బిల్లు వస్తుందన్నారు పైప్‌లై న్‌ల ద్వారా గ్యాస్‌ను సరఫ రా చేయడం సురక్షితమని నిర్విరామంగా సరఫరాను అందిస్తుందన్నారు అగ్ని ప్రమాదాలు లీకేజీలు ఉండమన్నారు గోదా వరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రభుత్వం ఆమోదంతో గ్యాస్ పైప్‌లైన్‌లు వేస్తుం దన్నారు. పర్యావరణ శుభ్రమైన చవకైన ఇంధనం అన్నారు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుడాల ఓఎన్జిసి గెయిల్ స్టేషన్ ఉందన్నారు. జీవో నెంబర్ 8 ప్రకారం నిర్దే శిత గడువులలో అనుమతు లు ఇవ్వాలన్నారు. అండర్ గ్రౌండ్ పైపు లైన్లు ఏర్పాట్లు ఆర్ అండ్ బి పంచాయ తీరాజ్ ఇంజనీరింగ్ విభా గాలు సహకరించా లన్నారు. జిల్లా వ్యాప్తంగా 13 వేల కనెక్షన్లకు మౌలిక వసతు లు కల్పించడం జరుగుతో శీదని ఇప్పటికీ 1000 కనె క్షన్లు పనిచేస్తున్నాయని తెలిపారు. టిడ్కో గృహ సముదాయాలు, అపార్ట్మెం ట్లలో ఈ యొక్క పైప్ లైన్ గ్యాస్ సరఫరా వ్యవస్థను పటిష్టంగా అమలు చేయా లన్నారు. మున్సిపల్ కమిషనర్లు వారి వారి పరిధిలో పైప్ లైన్ గ్యాస్ వ్యవస్థ వినియోగం పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేం దుకు అవగాహన సదస్సులను నిర్వహించి ఎల్పిజి కి ప్రత్యామ్నాయ శీగా సిఎన్జి గ్యాస్ వినియో గంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అను గుణంగా జిల్లా స్థాయి యుటిలిటీ కమిటీ సభ్యులు ముఖ్యమైన పాత్ర పోషించి ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు ద్వారా ఎల్పిజి గ్యాస్ కొరతను అధిగమించాలని ఆమె స్పష్టం చేశారు. కమిటీ సభ్యులైన అధికారులు ముఖ్యం గా హోటల్స్ కేటరింగ్ వంటి వ్యాపార సంస్థలకు అన్నదానం జరిపే దేవాలయాలకు ఈ కనెక్షన్ ఇవ్వాలని అవసరమైతే కొత్త లైన్లు నిర్మించడానికి సత్వారమే అనుమతులు జారీ అయ్యేలాగా చూస్తామని తెలిపారు ఈ కార్యక్ర మంలో జిల్లా పౌర సరఫ రాల అధికారి ఏ ఉదయ భాస్కర్, ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షకు ఇంజనీర్ బి రాజేశ్వరి, ఆర్ అండ్ బి ఎస్ ఈ బి రాము, పంచా యతీ రాజ్ డివిజనల్ ఇంజనీర్ అన్యం రాంబాబు మున్సిపల్ కమిషనర్లు రాజు వి నిర్మల్ కుమార్ డిపిఓ శాంత లక్ష్మి తదిత రులు పాల్గొన్నారు.

## గెద్దనాపల్లిలో శ్రీ గోపాలకృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



- ఆలయం వద్ద భారీ అన్నదానం.
- ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జ్యోతుల చంటిబాబు.

**కిర్లంపూడి, పెన్ పవర్ మార్చి 25:**కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపాలకృష్ణస్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.సుమారు 5000 మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదములు స్వీకరించారు. ఆలయానికి వచ్చిన భక్తుకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు.ఈ సందర్బంగా జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి భారీ స్థాయిలో భక్తులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు సమష్టి కృషితో ఈ అన్నదాన కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించడం జరిగిందన్నారు.భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలియజేశారు.

## డ్రైవర్స్ కాలనీ ఇళ్ళ స్థలాల బాధితులకు అండగా ఉంటాం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 25:** జగ్గంపేటలోని డ్రైవర్స్ కాలనీ ఇళ్ల స్థలాల బాధితులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్చార్జి మరోతి శివ గణేష్ అన్నారు. బుధవారం జగ్గంపేట డ్రైవర్స్ కాలనీ బాధితులను శివ గణేష్ కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
2010 సంవత్సరంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో జగ్గంపేట పట్టణంలో సర్వే నంబరు 196/2లో నాలుగు ఎకరాల 73 సెంట్లు స్థలంలో 170 మంది డ్రైవర్లు, విలేకరులు, దీన స్థితిలో ఉన్న పేద మహిళలు, ట్రాన్స్ జెండర్ లకు నివాస స్థలాలు కేటాయించడం జరిగింది. లబ్ధిదారులు కొంతమంది గృహాల నిర్మాణం చేసుకోగా, మరి కొంతమంది వారి పేదరికం మరియు గృహ అవసరాలు, కుటుంబ పోషణ మరియు కొంతమంది లబ్ధిదారులైన పేద మహిళలు ఆరోగ్య సమస్యలు దృష్ట్యా వైద్య ఖర్చుల నిమిత్తం అమ్ముకోవడం జరిగింది. ఈ కూటమి ప్రభుత్వం ఖాళీ చేయించి వారి అనుచరులకు ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కట్టబెట్టే ప్రయత్నంలో స్థానిక జగ్గంపేట తహసిల్దార్ వారిని తప్పుదోవ పట్టించి, స్థానిక జగ్గంపేట పంచాయతీ వారిని వారి అధికార బలంతో భయభ్రాంతులకు గురిచేసి చట్ట వ్యతిరేకంగా 2010 సంవత్సరంలో కేటాయించిన పట్టాలను రద్దుచేసి కొత్త పట్టాలు మంజూరు చేయించి స్థానిక ఎమ్మెల్యే ఒక కొత్త అక్రమ విధానానికి నడుం బిగించారని విమర్శించారు. జగ్గంపేట ఎమ్మెల్యే పేద ప్రజలపై చేస్తున్న దౌర్జన్యాన్ని అడ్డుకుంటామని మరోతి శివగణేష్ ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బిజిపి క్రమ శిక్షణ సమావేశం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 25:**స్థానిక కిరాణా మర్చంట్ హాల్ లో పట్టణ బిజిపి అధ్యక్షులు అయ్యల భాషా ఆధ్వర్యంలో బిజిపి క్రమ శిక్షణ సమావేశం జరిగింది. జనసంఘ్ పార్టీ స్థాపించిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం జిల్లా అధికార ప్రతినిధి అరిగెల పుల్లయ్య నాయుడు ఆధ్వర్యం వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిలుగా జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 1951 వ సంవత్సరంలో భారతీయ జనసంఘ్ పార్టీ గా మొదట శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్థాపించారని, అనంతరం జరిగిన పరిణామాలలో 1980, ఏప్రిల్ 6 వ తేదీన భారతీయ జనతా పార్టీగా ఆవిర్భవించిందని అన్నారు. 1990 సంవత్సరం నుండి బలమైన రాజకీయ శక్తిగా ఎదిగి అటల్ బిహారీ వాజ్ పేయి నేతృత్వంలో మొదటి సారి 1996 లో మొదటిసారి అధికారం లోకి వచ్చి 13 రోజులు అల్పకాలిక ప్రభుత్వం ఏర్పాటు చేశాక 1998 లో 13 నెలలు, 1999 లో జరిగిన ఎన్నికలలో ఎన్డీయే కూటమి ద్వారా పూర్తి కాలం ప్రభుత్వాన్ని నడిపారన్నారు. అనంతరం 2014 లో నరేంద్ర మోడీ నాయకత్వం లో పూర్తి స్థాయి అధికారం లోకి వచ్చిందన్నారు. అనంతరం పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి, వాటిని ప్రజల లోకి తీసుకెళ్లాలన్నారు. ఏప్రిల్ 6 వ తేదీన జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలని, అలాగే ఏప్రిల్ 14 న జరిగే రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సోషల్ మీడియా ప్రాధాన్యత గురించి వివరించి సోషల్ మీడియా ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లాన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్తాన్ కుట్రలను తిప్పికొట్టిన విషయం గురించి తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అమెరికా, ఇజ్రాయిల్– ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధి ద్వారా మన దేశానికి గ్యాస్, చమురు లను రప్పిస్తున్న నరేంద్ర మోదీ చతురత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకరమిల్లి శ్రీనివాసరావు, సలాది వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, చిలకమర్రి కస్తూరి, మాలే శ్రీనివాస్ నగేశ్, మాజీ పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, మైనారిటీ మోర్చా అధ్యక్షులు సంషూ సాద్విక్ , జిల్లా అధికార ప్రతినిధి అరిగెల పుల్లయ్య నాయుడు, సీనియర్ నాయకులు ఆర్వీ నాయుడు, జిల్లా కార్యాలయ ఇంచార్జి డీవిఎస్ రాజు, చిట్టూరి రాజేశ్వరి, గోకరకొండ గంగన్న స్వామి, కొండేటి జయలక్ష్మి, పావులూరి వెంకట్, పలువురు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## శెట్టిబలిజపేటలో ఉచిత వైద్య శిబిరం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 25:** జగ్గంపేట శెట్టిబలిజపేటలో ఉన్న రామాలయం వద్ద బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ జగ్గంపేట టౌన్ బీసీ నాయకులు రీసు రమణ 50వ పుట్టిన రోజు సందర్భంగా ఈ శిబిరం నిర్వహించినట్టు రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో ఉచితం గా బీపీ, షుగర్ టెస్టులు చేయడం జరిగిందని, అవసరమైన వారికి మందులు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదే విధంగా ప్రస్తుత వేసవి దృష్టిలో పెట్టుకొని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలిపారన్నారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకున్నారన్నారు. తమ పుట్టినరోజును పురస్కరించుకొని ప్రజలకు సేవ చేయడం మరింత ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పు అర్జున్, బీసీ నాయకుడు పాలిక వీరబాబు, గొర్రెలు రమణ, బాడితమని సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా తూలగిరి శ్రీ సీతారాముల ప్రాణ ప్రతిష్ట వేడుక





- చిన జీయర్ స్వామి చేతుల మీదుగా ప్రతిష్ట మహోత్సవం
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ,జ్యోతుల నెహ్రూ

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, మార్చి 25:**కాకినాడ జిల్లా నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న
నరేంద్రగిరి కొండపై నూతనంగా నిర్మించిన తూలగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శ్రీ సీతారాముల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన సీతానగరం ఆశ్రమాధిపతి శ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహా ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి చెప్పిన ప్రవచనాలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆలకించారు. ఈ ప్రతిష్ట మహోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యము కలవకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయానికి దర్శనానికి వచ్చిన సుమారు 10 వేల మందికి పైగా భక్తులకు కమిటీ సభ్యులు భారీ అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు, భక్తులు భారీగా తరలి రావడంతో నరేంద్ర గిరి ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పొ. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తప్పుదారి పట్టించేది మీరు



**జాతీయ నాయకుల సెంటర్‌పై స్పష్టత ఇవ్వండి**

**మండపేట. పెన్ పవర్.మార్చ్ 25 :**వైసీపీ ఎస్సీ, బీసీ, ఓసీ సంఘాల నేతల సూటి ప్రశ్న
మండపేట: అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం ఇవ్వకుండా డొంకతిరుగుడు సమాధానాలు ఎందుకని వైసీపీ ఎస్సీ, బీసీ, ఓసీ సంఘాల నాయకులు మందపల్లి రవికుమార్, పిల్లి శ్రీనివాస్, జొన్నపల్లి సత్తిబాబు, సన్మాల ధనరాజు, పొలమాల సత్తిబాబులు ప్రశ్నించారు. విజయలక్ష్మి నగర్‌లోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీలో ఉన్న ఎస్సీ నాయకులు ఎమ్మెల్యే వేగుళ్ళకు కొమ్ము కాస్తూ జాతికి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక వక్రబుద్ధితో మాట్లాడుతున్నారని ఆరోపించారు. జాతీయ నాయకుల విగ్రహాల సెంటర్‌గా నామకరణం చేస్తే అందరికీ ఆమోదయోగ్య మవుతుందని, పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని తెలిపారు. అయితే టీడీపీ వర్గీయులకు మాత్రమే ఇది రుచించడం లేదన్నారు. పట్టణ ప్రజల మెజారిటీ ఆమోదం ఉన్నప్పటికీ కొందరు స్వార్థపూరిత రాజకీయాల కోసం ఈ అంశాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలను తప్పుదారి పట్టించే వారు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. గత కౌన్సిల్లో జాతీయ విగ్రహాలకు సంబంధించిన అజెండా లేనప్పటికీ ఆరో వార్డు కౌన్సిలర్ కాశీ విశ్వనాథ్ ఈ అంశాన్ని లేవనెత్తి ద్రోహం చేయాలని చూశారని ఆరోపించారు. ఎవరి అడుగులకు మడుగులు ఒత్తుతున్నారో ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. అటువంటి వారి పక్కన కూర్చుని మాట్లాడడం జాతికి మీరు చేస్తున్న ద్రోహం కాదా అని ఎస్సీ నాయకులను ప్రశ్నించారు. ఇండిపెండెంట్‌గా గెలిచిన తోట త్రిమూర్తులు తన బలాన్ని నిరూపించుకున్నారని, గతంలో టీడీపీ రమ్మని బ్రతిమలాడితే మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తమ నాయకుడు వెన్నుపోటు రాజకీయాలు చేయరని స్పష్టం చేశారు. జాతీయ నాయకుల ఆదర్శాలను నిలబెట్టేందుకు మండపేట నడిబొడ్డున వారి విగ్రహాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ఎమ్మెల్యేకు ఈ ఆలోచన రాకపోవడం దురదృష్టకరమన్నారు. జాతీయ నాయకుల సెంటర్ నామకరణపై స్పష్టమైన వైఖరి వెల్లడించాలని కోరుతూ, ఆమోదిస్తారా లేక వ్యతిరేకిస్తారా అన్నది సూటిగా చెప్పాలని డిమాండ్ చేశారు.

## దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం



**న్యాయవాది దూలి జయరాజు**

**తీర్పును పునర్విచారణ చేయాలని డిమాండ్**

**మండపేట. పెన్ పవర్.మార్చి 25 :** దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ప్రముఖ దళిత న్యాయవాది దూలి జయరాజు మాదిగ తీవ్రంగా విమర్శించారు. ఈ తీర్పు వల్ల దళిత క్రైస్తవులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రక్షణ కవచంగా ఉన్న చట్టాలను తొలగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. తర్వాణి పేటలోని ఆయన కార్యాలయంలో ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉండ్రాజవరపు అర్జున్, ఎమ్మెస్పీ నాయకుడు గాలింకి నాగేశ్వరరావు, పాస్టర్లు టీ జాన్ మార్క్, పీ దైవా తదితరులతో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, ఆర్టికల్ 25లను ఈ తీర్పు నేరుగా ఉల్లంఘిస్తోందని జయరాజు అన్నారు. కులం, మతం, జాతి లేదా లింగం ఆధారంగా వివక్ష చూపరాదని ఆర్టికల్ 15 స్పష్టం చేస్తుండగా, ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను ఆర్టికల్ 25 హామీ ఇస్తుందని వివరించారు. మతం మారిన కారణంగా రక్షణలను తొలగించడం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని స్పష్టం చేశారు. మత స్వేచ్ఛను కుల హక్కులతో అనుసంధానం చేయడం సామాజిక న్యాయం భావనకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు.
మత మార్పిడి జరిగిన వెంటనే కుల వివక్ష అంతరించిపోదని, మారిన వ్యక్తులు కూడా సామాజిక అవమానాలు, వివక్షను ఎదుర్కొంటూనే ఉంటారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కారంచేడు, చుండూరు ఘటనలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ కుల ఆధారిత హింస మతంతో సంబంధం లేకుండా కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద లభించే రక్షణ లేకపోతే ఈ వర్గాలు మరింత అసురక్షితంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది కేవలం న్యాయపరమైన సమస్య మాత్రమే కాకుండా మానవ హక్కుల అంశంగా కూడా చూడాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ తీర్పుపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సుప్రీంకోర్టులో పునర్విచారణ పిటిషన్ దాఖలు చేయాలని జయరాజు డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల హక్కులను కాపాడటం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. మతం మారినా సామాజిక పరిస్థితులు మారకపోతే రిజర్వేషన్లు లేదా చట్టపరమైన రక్షణలను నిరాకరించడం అన్యాయమని స్పష్టం చేశారు. ఇది సమానత్వం అనే రాజ్యాంగ విలువకు విరుద్ధమని తెలిపారు.

# ఒమ్మంగి సీతారాముల ఆలయంలో మురళీకృష్ణంరాజు ప్రత్యేక పూజలు.

- ఆలయ కమిటీ సభ్యులకు లక్ష రూపాయలు విరాళం అందజేత.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, మార్చి 25**: ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో నూతనంగా పునర్ నిర్మించిన శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి నాయకులు, నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారాముల వారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఏడాది కాలంగా ఆలయ పునర్ నిర్మాణం చేపట్టడమే కాకుండా,విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు.
ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు లక్ష రూపాయలు విరాళం తన వంతు సహాయంగా మురళీకృష్ణంరాజు అందజేశారు. భవిష్యత్తులో మరింత సహకారం అందించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్,రామిశెట్టి దొరబాబు,ముమ్మిడి వీరబాబు,తోలేటి శేఖర్ ,గంట లచ్చబాబు(బుజ్జి),సుంకర తమ్మారావు,గంట చిట్టిబాబు,దేశెట్టి దుర్గాప్రసాద్,ఓరుగంటి వెంకన్నబాబు,గొర్ల తాతబాబు,నార్లంక వెంకన్నబాబు,దారా నూకరాజు,రామిశెట్టి శివ ,ఉగ్గినాలా వీరబాబు,ఓరుగంటి నాగేశ్వరరావు,దేశెట్టి శ్రీను,సమ్మంగి నాగేశ్వరరావు ,తేటకాయల రామకృష్ణ,తేటకాయల శ్రీను,గోరగడ్ల సోమరాజు,ఉగ్గినాలా నానాజీ ,ప్రత్తిపాడు ఎంపిటిసి సేంద్రిపు భాస్కర్ రావు,బొల్లు నాగేశ్వరరావు,జువ్వల దొరబాబు,గోనగల అజయ్,దాడి పుత్తయ్య,తూపాటి బాబ్జి,తిమ్మిశెట్టి రాజా,మద్రి సుబ్బారావు వైస్సార్సీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఆలమూరు శ్రీ సిద్ధార్థ స్కూల్ లో హానెస్టీ సెంటర్



**ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు**

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 25;**ఆలమూరు శ్రీ సిద్ధార్థ స్కూల్ లో కరస్పాండెంట్ ముల్లారావు హానెస్టీ సెంటర్ పేరుతో బుధవారం వినూత్నమైన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రకరకాల వస్తువులను ఒక చోట ఉంచారు. విద్యార్థులు తమకు కావలసిన వస్తువులను తీసుకుని దాని ఖరీదుని క్యాష్ బాక్స్ లో వేయాలి. అయితే వారు డబ్బులు వేసారా? లేదా? అనేదానికి ఎటువంటి నిఘా ఉండదు. చిన్నారుల్లో స్వీయ నిజాయితీని పెంపొందించడం కోసమే ఈ హానెస్టీ సెంటర్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు, విద్యార్థి దశలోనే నిజాయితీని బోధించడానికి, విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందని కరస్పాండెంట్ ముల్లారావు తెలిపారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్రమూర్తి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.



-ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 25:** శ్రీ సీతారామచంద్రమూర్తి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ పునః ప్రతిష్టాపన తోపాటు శ్రీ సీతారామచంద్రమూర్తి స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు గిరిబాబు కు ఘన స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు.
శ్రీ సీతారామచంద్రమూర్తి స్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా గిరిబాబు ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల వైసీపీ అధ్యక్షులు రామిశెట్టి నాని గారు, స్థానిక వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో ఎమ్మెల్సీ తోట



**మండపేట. పెన్ పవర్.మార్చి 25 :** మండపేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొన్నారు. మండలంలోని కేశవరం గ్రామంలో శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, వినాయక స్వామివారి పునఃనిర్మాణ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ తోట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చెల్లూరు గ్రామంలోని శ్రీ కోదండరామ శెట్టిబలిజ రామాలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సోమేశ్వరంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాలతో సత్కరించారు. దేవతామూర్తుల చిత్రపటాలను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలకు హాజరు కావడం ద్వారా తనకు ఆధ్యాత్మిక ఆనందం కలిగిందన్నారు. గ్రామాల్లో ఆలయాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొంది స్తాయని తెలిపారు. ప్రజలంతా శాంతి సౌఖ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## అవార్డు గ్రహీత "అంజి"కి అభినందన సత్కారం



**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 25:** రాజధాని లో ఇటీవల జరిగిన ఉగాది పురస్కారాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా చిత్రకళ సేవలో ప్రతిభ కనబరిచి కళా రత్న పురస్కారాన్ని అందుకున్న గ్రామానికి చెందిన అంజి ఆకొండి ని గ్రామ సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ ఆధ్వర్యంలో పంచాయితీ ఆవరణలో అభినందన సత్కార సభ ఏర్పాటు చేసి ఘనంగా అంజని సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అంజి చిన్ననాటి నుండి చిత్రకళే శ్వాసగా కొనసాగుతూ కళల కాణాచి కోనసీమ నుండి అమరావతి స్థాయికి మన గ్రామానికి గుర్తింపు తేవడం మనందరికీ ఘనతేనని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పలువురు వ్యక్తులు పాల్గొని అంజి గురించి మాట్లాడి, దుస్సాలువలతో పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అంజి మాట్లాడుతూ నాకు వచ్చినది ఉగాది పరిష్కారం నాకు మా కుటుంబానికి పరిమితం అవ్వకుండా, ఊరు ఊరంతా ఆనందపడ్డారు, ఈ పురస్కారం ఎవరికివారు తమదే అనుకుని సంబరాల్లో పాల్గొన్నారు, తెలపడానికి ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి కలవడం సమిష్టిగా అందరూ కలిసి ఒకటై పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలపడం జరిగింది. పుట్టిన ఊరిలో నాకు ఎంతటి ఆదరభిమానాలు దక్కడం నాతోపాటు నాకు జన్మనిచ్చిన తండ్రి కూడా సత్కరించడం చాలా ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లా నరసింహా మూర్తి, శీలం సూర్యనారాయణ, వెంట్రు సుధీర్,నల్లా రాంబాబు,తటపర్తి వెంకటరత్నం, వాసంశెట్టి రాజేశ్వరరావు, పిల్లి ప్రసాద్, వాసంశెట్టి శ్రీను, సానబోయిన నాగేశ్వరరావు, మధుబాబు, ఆకొండి గోపాలకృష్ణ, పెద్దింటి తంబి, కిరణ్, కృష్ణ, ఆణివిళ్ళ పవన్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి కళ్యాణోత్సవాలకు రాట ముహూర్తం

* నిత్య అన్నదానానికి భక్తులు విరాళాలు






**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 25:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి దివ్య కళ్యాణమహోత్సవాల సందర్భంగా బుధవారం రాట ముహూర్తం చేశారు .ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి బి. వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

స్వామివారి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సన్నిధిలో నిర్వహించే నిత్యఅన్నదాన కార్యక్రమానికి ఏలూరు పట్టణానికి చెందిన చల్లగళ్ల తిరుపతిరావు రూ.50,116లను విరాళంగా సమర్పించారు.

వీరిని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.. వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనం చేయగా,ఈఓ బి. వెంకటరమణమూర్తి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

-ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 25**: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బోలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు.ప్రత్తిపాడు మండలం, పాండవులపాలెం గ్రామంలో ముద్రగడ గిరిబాబు పర్యటించి సందర్శించి స్వామి వారిని దర్శించికున్నారు. అనంతరం స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా గ్రామ కమిటీ, అనుబంధ కమిటీల నియామకంపై కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు.

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు,ఇతర సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ ఎలా చేరాయో వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించడమే కాకుండా, కూటమి ప్రభుత్వం అవలింబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.పార్టీ కార్యకర్తలకు, నాయకులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గిరిబాబు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండలం వైసీపీ అధ్యక్షులు రామిశెట్టి నాని,స్థానిక వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ భగవానుడి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

-వైసీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, మార్చి 25:** శ్రీకృష్ణ భగవానుడి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ నాయకులు, నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు.బుధవారం శంఖవరం మండలం కొంతంగి గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు శ్రీ కృష్ణ ఆలయం ధ్వజస్థంబ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి 20,000 రూపాయలు విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గింజల కొండబాబు,ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, కాకినాడ జిల్లా అంగన్వాడి విభాగం పద్మావతి,దూళ్ళ శివ, బత్తుల శివ,తోట రాంబాబు,గింజల బాబురావు,ఈగల గంగా,కొత్తపల్లి వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కోన బాబ్జి, డాక్టర్ ఎడ్ల.సత్యనారాయణ ,ప్రత్తిపాడు ఎంపిటిసి సేంద్రిపు భాస్కర్ రావు,బొల్లు నాగేశ్వరరావు,జువ్వల దొరబాబు,గోనగల అజయ్,దాడి పుత్తయ్య ,తూపాటి బాబ్జి ,తూపాటి మణికంఠ,తిమ్మిశెట్టి రాజా,మద్రి సుబ్బారావు గారు వైస్సార్సీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## స్థిరమైన ఘన వ్యర్థాలు,నీటి నిర్వహణపై ప్రభావవంతమైన అవగాహన కల్పించడం కొరకు సామర్థ్యం పెంపుదల శిక్షణ




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 25.**స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్, స్వర్ణ ఆంధ్రా స్వచ్ ఆంధ్రా లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో కు స్థిరమైన ఘన వ్యర్థాలు మరియు వాడిన నీటి నిర్వహణపై ప్రభావవంతమైన అవగాహన కల్పించడం కొరకు సామర్థ్యం పెంపుదల శిక్షణను స్థానిక మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్ నందు ఈ రోజు కంప్లీట్ చేయుట జరిగింది. ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను నాలెడ్జింగ్ పార్టనర్స్ సహస్ మరియు వాష్ ఇన్స్టిట్యూట్ సంస్థల సహకారంతో ఎంతో అట్టహాసంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ శిక్షణ కార్యక్రమంను 65 మంది మెప్మా ఆర్పీ స్ కు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు మున్సిపల్ కమిషనర్ ఎం.యేసుబాబు మాట్లాడుతూ ఫీల్డ్ లెవెల్ ఈ శిక్షణ అనంతరం స్వర్ణ ఆంధ్రా స్వచ్ ఆంధ్రా కార్యక్రమాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, కంపోస్టింగ్ విధానము, అలాగే స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ మొదటి స్థానం కొరకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కొనియాడారు. మున్సిపల్ శానిటేషన్ ఇన్స్పెక్టర్లు , మెప్మా సిఎంఎం సుధాకర్ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ పి. రాము , రిసోర్స్ పర్సన్ టీ.మధుసూదన రావు గారు,వాలంటీర్ నిర్మల మరియు పుష్ప ఎస్ ఎచ్ జి మెప్మా ఆర్పీ మొదలగు వారు పాల్గొన్నారు.ఈ ట్రైనింగ్ అనంతరం మెప్మా ఆర్పీ లకు కమిషనర్ చేతులమీదుగా సర్టిఫికేట్ లు పంపిణీ చేయుట తో పాటు శ్రీమతి యన్. రజని స్వచ్ఛ ఆంధ్రా స్వర్ణ ఆంధ్రా ప్రతిజ్ఞ ను ఆర్పీ లు తో చేయించడం జరిగింది.డి సుమారు 100 మంది వైఎస్సార్ సీపీ శ్రేణులు 15 కార్లతో ర్యాలీ గా వెళ్ళి అంబటి రాంబాబు కి ఘన స్వాగతం పలికారు. తాడేపల్లిగూడెం లో పార్టీ విషయలు గురించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## అన్నదాత సుఖీభవ పై విస్తృత డోర్ టు డోర్ అవగాహన



**చింతూరు, పెన్ పవర్, మార్చి 25:**చింతూరు మండలంలోని జువ్విగూడెం గ్రామంలో రైతన్న మీకోసం అన్నదాత సుఖీభవ కార్యక్రమం బుధవారం నిర్వహించబడింది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విస్తృతంగా డోర్ టు డోర్ ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి చింతూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ నేతృత్వం వహిస్తూ, రైతుల వద్దకు నేరుగా వెళ్లి అన్నదాత సుఖీభవ పథకం ప్రయోజనాలను వివరించారు. ప్రతి రైతు ఇంటిని సందర్శిస్తూ పథకం ద్వారా లభించే ఆర్థిక సహాయం, అర్హతలు, దరఖాస్తు విధానం వంటి అంశాలను స్పష్టంగా తెలియజేశారు. రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జమాల్ ఖాన్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా గ్రామంలో నిర్వహించిన సమావేశంలో కూడా అన్నదాత సుఖీభవ పథకం ప్రాముఖ్యతను వివరించి, రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని డోర్ టు డోర్ ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## ఆదిరెడ్డి దళిత వ్యతిరేక వైఖరి ఖండిస్తూ వైసిపి శ్రేణులు నిరసన

ఆ పార్టీ నుండి బహిష్కరించాలి దళితులకు క్షమాపణ చెప్పాలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 25:**ఒక కుటుంబ వివాదంలో దళితులను అవమానపరిచిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని, తెలుగుదేశం పార్టీ నుండి చంద్రబాబు బహిష్కరించాలని, దళితులకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని వైఎస్ఆర్సిపి దళిత నాయకులు, డిమాండ్ చేశారు. దళితులను కించపరిచారన్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన సందర్భంగా దళితుల మనోభావాలను దెబ్బతీసిన ఆదిరెడ్డి అహంకారపూరిత వైఖరిని ఖండిస్తూ వైఎస్ఆర్సిపి శ్రేణులు, దళిత వర్గాలు సంయుక్తంగా బుధవారం స్థానిక గోకవరం బస్టాండ్, అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్, ఆదిరెడ్డి అరాచకాలు నశించాలని, దళితులకు క్షమాపణ చెప్పాలని, ఆదిరెడ్డి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని తెలుగుదేశం పార్టీ నుంచి బహిష్కరించాలని ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టిజిఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయని, నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ఎమ్మెల్యే తండ్రి గా, ప్రజా ప్రతినిధిగా పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దళితులను కించపరిచిన చేసిన వ్యాఖ్యలు అహంకారపూ రితమని , వివక్షతతో కూడుకున్నవని ఆయనపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు బేషరతగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో దగా పడిన దళితులకు వైఎస్ఆర్సిపి, న్యాయం జరిగేంత వరకు అండగా నిలుస్తుందన్నారు. మాజీ న్యాయమూర్తి, దళిత మేధావి జడ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో చాలామంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు దళిత వర్గాలను వేధిస్తున్నాయని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలు మారిన,

ప్రభుత్వాలు మారినా దళితులపై దాడులు మాత్రం ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . సామాజికంగా, రాజకీయంగా విద్యాపరంగా, చైతన్యవంతమైన తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ గా చేసిన అప్పారావు దళితులను అవమానకరంగా మాట్లాడటం అంబేద్కర్ రాజ్యాంగాన్ని ధిక్కరించినట్లేనని ఆయనపై తప్పనిసరిగా ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేయని యెడల న్యాయపరంగా ఏ స్థాయి వరకు అయినా వెళ్లి కేసు పెట్టేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. దళితులను కించపరిచిన అప్పారావు వైఖరి పై సొంత తెలుగుదేశం పార్టీలోని దళిత నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు. ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడిన విధంగా వైసిపి పార్టీ వారు మాట్లాడితే ఈపాటికి కేసులు పెట్టి జైలుకు పంపించేవారని అన్నారు . కూటమి ప్రభుత్వంలో దళితుల ఆత్మగౌరవం, రక్షణ కోసం పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల నుంచి దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ప్రధానంగా ప్రజాప్రతినిధుల పాత్ర ఎక్కువగా ఉందన్నారు. ఒక వివాదంలో పెద్దమనిషిగా ఉన్న మాజి ప్రజా ప్రతినిధి దళితులను కులం పేరుతో దూషించడం, చంపేస్తానని బెదిరించడం, దాడులు చేయడం గర్హనీయమన్నారు. మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం కలిగించిన దళితులపై దూషణ, దాడుల సంఘటనలో మాజీ ఎమ్మెల్సీ అప్పారావును తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో ఆదిరెడ్డి అప్పారావుకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం షోకాజు నోటీసు కూడా ఇవ్వలేదని, దళితుల రక్షణ పట్ల ఆ పార్టీ అధిష్టానానికి ఆలోచన లేదా అని ప్రశ్నించారు. దళితుడిని కొట్టి, హత్యాయత్నం చేసిన ఆయనపై కేసు నమోదు చేయని పోలీస్ అధికారులు బాధితునీ పైన కేసు పెట్టడం దారుణమన్నారు. టిడిపి దళితులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కేసు కట్టేంతవరకు ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దళిత వర్గాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు, నాయకులు, మహిళలు, దళిత వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఏపీలో మహిళా నియోజవర్గాలు..ఇవే

**తిరుపతి,మార్చి 25, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా నియోజకవర్గాలు పెరగనున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్డీఏ సమావేశంలో స్పష్టమైన సంకేతాలు అందాయి దీనిపై. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే పునర్విభజన బిల్లు పార్లమెంట్లో ఆమోదించనున్నారు. అదే జరిగితే దేశవ్యాప్తంగా పార్లమెంట్ సీట్లతో పాటు అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే ఇప్పటికే మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తూ 2023లో పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందింది. అయితే ఇప్పుడు పునర్విభజన బిల్లుతో పాటు మహిళా బిల్లును కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సంచలనంగా మారింది. పునర్ విభజనకు సంబంధించి ఏపీలో 50% చొప్పున అసెంబ్లీ, లోక్సభ సీట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనతో అసెంబ్లీ స్థానాలు 263, లోక్సభ సీట్లు 38 కి చేరుకుంటాయి. మహిళా ప్రాతినిధ్యం కూడా పెరగనుంది. వారికి 87 అసెంబ్లీ, 13 పార్లమెంట్ సీట్లు దక్కనున్నాయి. అయితే ఫలానా నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ చేస్తారని చెప్పడం కష్టం కానీ.. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండే నియోజకవర్గాలను మాత్రం మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో 58 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికం. వాటిని మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.రాష్ట్రంలో ప్రధానంగా భీమిలి నియోజకవర్గం లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అక్కడ ఏకంగా 1,65,570 మంది మహిళలు ఉండడం విశేషం. పాణ్యం, గాజువాక, చంద్రగిరి, తిరుపతి, మంగళగిరి, పెనమలూరు, రంపచోడవరం, పెందుర్తి, గురజాల, విశాఖపట్నం నార్త్,కోవూరు, కర్నూలు, విజయవాడ ఈస్ట్,విజయవాడ సెంట్రల్, గుంటూరు వెస్ట్,గన్నవరం, మైలవరం, నెల్లూరు రూరల్, తెనాలి, నంద్యాల, అనంతపురం అర్బన్, ఇచ్చాపురం, కడప, శ్రీకాకుళం, చింతలపూడి, రాజమహేంద్రవరం సిటీ,ప్రత్తిపాడు, రాజమహేంద్రవరం రూరల్, గుంతకల్లు, కాకినాడ సిటీ, పలమనేరు, విశాఖపట్నం ఈస్ట్, మాచర్ల,వినుకొండ, కాకినాడ రూరల్, భీమవరం, రాయదుర్గం, మదనపల్లి,పోలవరం, కావలి,జమ్మలమడుగు,కొత్తపేట, పాయకరావుపేట, శ్రీకాళహస్తి, ప్రొద్దుటూరు,ఆదోని, విజయనగరం, రాయచోటి, కదిరి, రాప్తాడు,ఆలూరు, గుంటూరు ఈస్ట్, విజయవాడ వెస్ట్, గూడూరు, ఒంగోలు, బనగానపల్లె,తాడిపత్రి నియోజకవర్గాల్లో మహిళలు అధికం.పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి విశాఖపట్నంలో అత్యధికంగా 9,20,376 మంది మహిళలు ఉన్నారు. ఆ తరువాత స్థానాల్లో గుంటూరు, నరసరావుపేట, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, నంద్యాల,విజయవాడ, కర్నూలు,కాకినాడ, ఏలూరు, కడప, చిత్తూరు, రాజంపేట, శ్రీకాకుళం, అనకాపల్లి, హిందూపురం, రాజమండ్రి,ఒంగోలు, అరకు, విజయనగరం, మచిలీపట్నం, బాపట్ల, అమలాపురం, నరసాపురం పార్లమెంట్ స్థానాల్లో మహిళలు ఎక్కువ. మరి ఈ నియోజకవర్గాల్లో మహిళలకు ఛాన్స్ దక్కుతుందా? లేదా? అన్నది చూడాలి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఢిల్లీలోనూ నెంబర్ 11 తంటా

**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** ఢిల్లీలోని నూతన పార్లమెంటు భవనంలో గదుల కేటాయింపు విషయం.. ఏపీలో ఇప్పుడు ఆసక్తికర చర్చకు కారణమైంది. గదుల కేటాయింపు ప్రక్రియలో భాగంగా స్పీకర్ కార్యాలయం.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11వ నంబర్ గది కేటాయించింది. పార్టీల బలాబలాల ఆధారంగా స్పీకర్ కార్యాలయం గదులను కేటాయిస్తోంది. ఈ క్రమంలోనే వైసీపీ ఎంపీల కోసం నూతన పార్లమెంట్ భవనం ఫస్ట్ ఫ్లోర్లోని 11వ నంబర్ గదిని కేటాయించారు. అయితే వైసీపీ ఎంపీలు.. తమ గదిని మార్చాలని స్పీకర్ను కోరినట్లు తెలిసింది. స్పీకర్ ఓంబిర్లాతో భేటీ అయిన వైసీపీ ఎంపీలు.. తమకు 11వ నెంబర్ గది వద్దని కోరినట్లు తెలిసింది. అందుకు బదులుగా మరో గదిని కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. దీంతో వైసీపీ ఎంపీల విజ్ఞప్తిని సానుకూలంగా తీసుకున్న స్పీకర్.. వైసీపీ ఎంపీల కోసం 12వ నంబర్ రూమ్ కేటాయిస్తూ మార్పులు చేశారు.మరోవైపు నూతన పార్లమెంట్ భవనంలో టీడీపీకి 9వ నంబర్ గది కేటాయించారు. మొదటి అంతస్తులోని 9వ నంబర్ గదిని టీడీపీ ఎంపీల కోసం కేటాయించారు. కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి రావటంతో.. పాత పార్లమెంట్ భవనంలో ఉన్న పార్టీ ఆఫీసులనుఖాళీ చేయిస్తున్నారు. నూతన పార్లమెంట్ భవనంలో పార్టీలకు గదులు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలోనే వైసీపీకి 12, టీడీపీకి 9వ నంబర్ గదులు కేటాయించామరోవైపు 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 11 సీట్లకు పరిమితమైంది. 2019 ఎన్నికల్లో 151 సీట్లలో విజయం సాధించిన వైసీపీ.. 2024లో మాత్రం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. వైఎస్ జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహా మంత్రివర్గంలోని నేతలందరూ ఓటమి పాలయ్యారు. అసెంబ్లీ సామర్థ్యంలో పది శాతం సీట్లు సాధించకపోవటంతో వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీకి ఏపీ ప్రభుత్వం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు.ఇదే సమయంలో వైసీపీ 11 సీట్లను పరోక్షంగా ఉద్దేశిస్తూ కూటమి పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తుంటారు. ఈ క్రమంలోనే నూతన పార్లమెంట్ భవనంలో వైసీపీకి 11 నంబర్ గది కేటాయించడం.. ఆ తర్వాత వైసీపీ ఎంపీల అభ్యర్థనతో దానిని 12వ నంబర్ గదికి మార్చటం చర్చనీయాంశమవుతోంది.

## బెజవాడలో ఏం జరుగుతోంది....

**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** ఉగ్రవాదులతో సంబంధం ఉందని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు విజయవాడ సీసీఎం కోర్టు రిమాండ్ విధించింది. ఏప్రిల్ 6వ తేదీ వరకూ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఉన్నాయంటూ ముగ్గురు యువకులను విజయవాడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేసి ఉగ్రవాద భావజాలాన్ని యువతలో ప్రోత్సహించేందుకు వీరు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. విజయవాడలో ఉగ్రవాద సానుభూతిపరుల కదలికల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకొని.. సోషల్ మీడియా ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను విజయవాడ టూటౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మహమ్మద్ డానిష్, మీర్జా సొహైల్ మహమ్మద్ రహంతుల్లా షరీఫ్ అనే ముగ్గురు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ యువకులు టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా యువతను ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరికి పాకిస్థాన్ హ్యాండ్లర్ల నుంచి నిధులు సమకూరుతున్నట్లు నిఘావర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు ముగ్గురు నిందితులను విజయవాడ పోలీసులను విజయవాడ సీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. వీరికి ఏప్రిల్ ఆరో తేదీ వరకూ కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు వీరిని విజయవాడ సెంట్రల్ జైలుకు తరలించారు. మరోవైపు విచారణ సందర్భంగా లాయర్ను నియమించుకున్నారా? అని న్యాయమూర్తి నిందితులను ప్రశ్నించారు. అయితే తాము నియమించుకోలేమని నిందితులు కోర్టుకు తెలిపారు. దీంతో ఈ విషయాన్ని రాతపూర్వకంగా తెలియజేయాలని కోర్టు ఆదేశించింది.మరోవైపు ఈ కేసులో యాంటీ టెర్రరిస్ట్ దళాలు జరిపిన విచారణలో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముగ్గురు యువకులు ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో గ్రూపును ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఏడు రాష్ట్రాలలో 42 మంది సభ్యులతో ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ గ్రూపు ద్వారా ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నట్లు గుర్తించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటుగా ఢిల్లీ, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా గ్రూపులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీంతో ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ముఖానికి మాస్కులతో ఫోటోలు, సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు, ఆడియోలు పెడుతున్నట్లు గుర్తించారు. పాకిస్థాన్ , అఫ్గానిస్తాన్లో ఉగ్రవాద శిక్షణకు వెళ్లేలా యువతను ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు

## అనంతలో ఓపెన్ కూలింగ్ సిస్టమ్

**అనంతపురం, మార్చి 25, పెన్ పవర్:** సవి కాలంలో వాహనదారులకు ఉపశమనం కలిగించేలా అనంతపురంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. సురేష్ నాయక్ అనే ఉపాధ్యాయుడు ఆలోచనతో దీనిని రూపొందించారు. ప్రయోగాత్మకంగా సప్తగిరి సర్కిల్ వద్ద ఏర్పాటు చేశారు. దీని ద్వారా వాహనదారులపై తుంపర్లుగా నీటిని చల్లుతారు. దీంతో ఎండవేడిమి నుంచి వారికి ఉపశమనం కలుగుతుందని అధికారులు చెప్తున్నారు.వేసవి కాలం వచ్చేసింది. ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం పది గంటలకే భానుడు భగభగమండిపోతున్నాడు. మార్చి నెల మధ్యలోనే ఈ పరిస్థితి ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో భానుడి ఉగ్రరూపం మరోస్థాయికి చేరనుంది. ఈ నేపథ్యంలో ప్రజలు భయపడిపోతున్నారు. ఇక ఎండాకాలంలో రోడ్డుపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి. ఓ వైపు సుర్రుమనిపించే సూరీడు.. మరోవైపు వేడిగాలులు.. దీంతో ఉక్కబోతను భరించలేక ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఇక వాహనదారుల పరిస్థితి అయితే చెప్పక్కర్లేదు. పైన ఎండ, కింద బండి వేడితో ఇబ్బందుల పడుతుంటారు. ఈ నేపథ్యంలోనే అనంతపురం జిల్లాలో ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.రాజేంద్రనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్గా పనిచేస్తున్న సురేష్ నాయక్ బుర్రలో మెదిలిన ఆలోచన ఇది. వేసవి తాపం నుంచి వాహనదారులకు ఉపశమనం కల్గించేందుకు సురేష్ నాయక్..ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఆలోచన చేశారు. ఇంజనీరింగ్ అధికారుల సహాయంతో అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ఎండలకు వాహనదారులు ఇబ్బందులు పడకుండా సప్తగిరి సర్కిల్ వద్ద దీనిని ఏర్పాటు చేశారు.ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ అంటే.. ఒక డ్రమ్ములో నీళ్లను నింపుతారు. ఈ నీటిని మోటార్ల సాయంతో పైపుల ద్వారా తుంపర్లుగా.. రోడ్డుపైనే వెళ్లే వాహనదారులపై వదులుతారు. ట్రాఫిక్ సిగ్నల్ పడిన సమయంలో కూడలి వద్ద ఉన్న వాహనదారులపై తుంపర్లు, తుంపర్లుగా నీరు పడటంతో.. వాతావరణం చల్లబడటంతో పాటుగా.. వారికి కాస్త ఉపశమనంగా ఉంటుందని అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టం ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని అధికారులు చెప్తున్నారు. మొత్తంగా ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ కారణంగా అనంతపురంలోని వాహనదారులు కాస్త రిలీఫ్ పొందుతున్నారు.

# జనసేనలో వారసుల తంటా

**కాకినాడ, మార్చి 25, పెన్ పవర్:** జనసేన పార్టీ ప్రారంభం నుంచే కొన్ని స్పష్టమైన సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించకూడదనే ఆలోచన పార్టీకి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. 2019 ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఆ సమయంలో పార్టీకి పెద్దగా ప్రభావం కనిపించలేదు. అయితే 2024 ఎన్నికల నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పార్టీకి ప్రజల్లో డిమాండ్ పెరిగింది, నాయకులు కూడా ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఈ మార్పు వల్లే జనసేన రాజకీయంగా బలపడినట్టు కనిపిస్తోంది.దీంతో జగ్గంపేట వంటి నియోజకవర్గాల్లో టికెట్ల కోసం పోటీ తీవ్రంగా జరిగింది. పార్టీ బలపడటంతో నాయకులు కూడా తమ స్థానం కోసం ప్రయత్నాలు పెంచారు. అయితే ఇప్పుడు మరో ఆసక్తికరమైన పరిణామం కనిపిస్తోంది. కొంతమంది ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. బహిరంగంగా పెద్దగా మాట్లాడకపోయినా, నియోజకవర్గ స్థాయిలో తమ వారిని ప్రోత్సహిస్తూ మౌనంగా వ్యూహాలు అమలు చేస్తున్నారు.ప్రస్తుతం ఉన్న 21 మంది ఎమ్మెల్యేలలో కొందరు తమ వారసులను రంగంలోకి దించాలనే ఆలోచనలో ఉన్నారు. మరోవైపు కొంతమంది సీనియర్ నాయకులు కూడా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని




తమ కుటుంబ సభ్యులకు అవకాశాలు కల్పించాలని చూస్తున్నారు. అయితే ఈ పరిస్థితి జనసేన పార్టీ అసలు సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటివరకు ప్రజల్లో పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. వారసత్వం కంటే ప్రజాదరణ ఉన్నవారిని ఎంపిక చేయడమే ఆయన విధానంగా కనిపిస్తోంది. గతంలో కూడా ఆయన ఇదే విధంగా టికెట్లు ఇచ్చారు. కాకినాడ రూరల్ నుంచి నానాజీ , రైల్వే కోడూరు నుంచి అరవ శ్రీధర్ వంటి వారికి అవకాశం కల్పించారు. వీరంతా తమ పనితీరు ద్వారా గుర్తింపు పొందిన వారే.ఇప్పుడూ అదే విధానాన్ని కొనసాగించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పటికే కొంతమంది ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. ఈ పరిస్థితిలో పార్టీ తీసుకునే నిర్ణయం కీలకం అవుతుంది. మొత్తంగా చూస్తే, జనసేన పార్టీ సిద్ధాంతాలు ఒకవైపు, నాయకుల వ్యక్తిగత ఆశయాలు మరోవైపు ఉన్న పరిస్థితి ఏర్పడింది. పవన్ కళ్యాణ్ ఈ రెండింటి మధ్య ఎలా సమతుల్యం పాటిస్తారు, వారసత్వ రాజకీయాలపై ఎంతవరకు రాజీ పడతారు అనేది వచ్చే రోజుల్లో స్పష్టత వచ్చే అంశంగా మారింది.

# జగన్ ఇమేజ్ డ్యామేజ్



**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబంలో చెలరేగిన ఆస్తుల వివాదం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది. తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలతో జగన్ సాగిస్తున్న ఈ న్యాయపోరాటం కేవలం ఒక కుటుంబ సమస్యగా కాకుండా, రాజకీయంగా పెను ప్రభావం చూపే అంశంగా మారింది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఆస్తుల పంపిణీ విషయంలో జగన్, షర్మిల మధ్య విభేదాలు పొడసూపాయి. గతంలో కుదుర్చుకున్న ఒక అవగాహన ఒప్పందం ప్రకారం కొన్ని ఆస్తులను చెల్లికి బదలాయించాల్సి ఉండగా, జగన్ ఆ ప్రక్రియను నిలిపివేయడం వివాదానికి కేంద్రబిందువు అయింది. ఈ క్రమంలో జగన్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ను ఆశ్రయించడం, షర్మిలకు ఇచ్చిన షేర్లను తిరిగి తీసుకోవాలని కోరడం సంచలనం సృష్టించింది. దీనికి ప్రతిగా తల్లి విజయమ్మ, షర్మిల తరఫున నిలబడి అఫిడవిట్ దాఖలు చేయడం జగన్కు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది.జగన్ రాజకీయ జీవితం మొత్తం "మాట తప్పను.. మడమ తిప్పను" అనే నినాదం చుట్టూ తిరుగుతుంది. అయితే, తండ్రి బతికి ఉన్నప్పుడు చెప్పిన అంశాలను, కుటుంబ ఒప్పందాలను ధిక్కరించడం వల్ల ఆయన 'విశ్వసనీయత' ప్రశ్నార్థకమైంది. సొంత తల్లిని, చెల్లిని కోర్టుకు లాగడం అనేది తెలుగు సమాజంలో నైతికంగా ఆమోదయోగ్యం కాని విషయం. సామాన్యులెవరూ దీన్ని అంగీకరించరు. చెల్లి విషయంలో అయినా కాస్త ఆలోచిస్తారేమో కానీ, తల్లిని కూడా జగన్ ఇబ్బంది పెడుతున్నారనే అంశమే ప్రజల్లోకి బాగా వెళ్తోంది. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్ను గణనీయంగా దెబ్బతీస్తోంది.ఈ వివాదం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూర్చేలా ఉంది. జగన్ తన పాలనలో 'అక్కా.. చెల్లెమ్మ' అంటూ మహిళలకు ప్రాధాన్యతనిచ్చారు. కానీ సొంత చెల్లికి ఆస్తి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనే ప్రచారం మహిళా ఓటర్లలో ప్రతికూల భావనను కలిగించే అవకాశం ఉంది. టీడీపీ, జనసేన వంటి పార్టీలు ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నాయి. "సొంత తల్లికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు?" అనే ప్రశ్నను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న వైసీపీ కార్యకర్తలు ఈ వివాదంపై ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం విడిపోవడం వల్ల పార్టీ పట్ల ఉన్న సెంటిమెంట్ పలచబడే ప్రమాదం ఉంది.జగన్ తన ఆస్తులు ఈడీ అటాచ్మెంట్లో ఉన్నాయని, అందుకే బదలాయింపు సాధ్యం కాదని వాదిస్తున్నారు. కానీ, కుటుంబ సభ్యులు దీనిని కేవలం జగన్ 'మొండితనం'గా భావిస్తున్నారు. ఆస్తుల విలువ కంటే, తన మాటే చెల్లాలనే ఆయన 'ఈగో' వల్లనే ఈ సమస్య ఇంతవరకు వచ్చిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజకీయ చాణక్యత ప్రదర్శించాల్సిన చోట, జగన్ తన కుటుంబంపై కఠినంగా వ్యవహరించడం వ్యూహాత్మక తప్పిదమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.జగన్ ఈ సమస్యను త్వరగా పరిష్కరించుకోకపోతే, భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఆస్తుల వల్ల ఆర్థిక బలం పెరగవచ్చు కానీ, రాజకీయాల్లో అత్యంత విలువైన ప్రజాభిమానం, విశ్వసనీయతను ఆయన కోల్పోయే ప్రమాదం ఉంది. తల్లి విజయమ్మ ప్రత్యక్షంగా షర్మిల వెనుక నిలబడటం జగన్ రాజకీయ ప్రయాణంలో అతిపెద్ద సవాలుగా మిగిలిపోనుంది.

# వన్డే ప్రపంచకప్ జట్టులో టీ20 వరల్డ్ కప్ హీరోలకి నో ఛాన్స్.. ఏకంగా 8 మంది ఔట్



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా, జింబాబ్వే మరియు నమీబియా సంయుక్త వేదికలలో జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. 2026 టీ20 వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి ట్రోఫీ గెలిచిన జోరులో ఉన్న టీమిండియా, వన్డే జట్టులో సమూల మార్పులు చేసేందుకు రెడీ అయింది. వన్డే క్రికెట్ లో ఓపికతో పాటు ఇన్నింగ్స్‌ను నిర్మించే వారిపై బీసీసీఐ మొగ్గు చూపుతోంది.

టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా ఆడిన సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్ లాంటి ప్లేయర్స్ కి 2027 వన్డే జట్టులో చోటు దక్కే అవకాశం కనిపించడం లేదు. వీరందరూ కేవలం టీ20 స్పెషలిస్టులుగానే ముద్రపడటం, వన్డే ఫార్మాట్‌కు అవసరమైన నిలకడ వీరిలో లేకపోవడంతో ఈ 8 మంది ఆటగాళ్ల ఎంపికపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. కానీ, రాబోయే దేశవాళీ, ద్వైపాక్షిక సిరీస్‌లలో వీళ్లందరూ అద్భుతంగా రాణిస్తే తప్ప వన్డే జట్టులోకి పునరాగమనం చేయడం కష్టమే.

భవిష్యత్తు సారథిగా శుభ్‌మన్ గిల్‌ను రెడీ చేయాలని బీసీసీఐ సెలక్టర్లు భావిస్తున్నారు. గిల్ ఇప్పటికే తన బ్యాటింగ్, నాయకత్వ లక్షణాలతో ముందుకు నడుస్తున్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లలో ఆశించిన ఫలితాలను రాబట్టకపోయినప్పటికీ, సుదీర్ఘ కాలం పాటు జట్టును నడిపించే సామర్థ్యం అతడికి ఉందని జట్టు యాజమాన్యం నమ్ముతుంది. ఓపెనర్‌గా శుభ్‌మన్ చేసే పరుగులు జట్టుకు అత్యంత కీలకం అయ్యే ఛాన్స్ ఉంది.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఫామ్ జట్టుకు ప్లస్ కానుంది. వన్డే ఫార్మాట్లో కోహ్లీ స్థిరత్వం, రోహిత్ దూకుడు 2027లోనూ టీమిండియాకు అవసరమని క్రికెట్ పండితులు పేర్కొంటున్నారు. వీరిద్దరూ ఫిట్‌నెస్ కాపాడుకుంటే తుది జట్టులో ఉండటం పక్కా.. మరోవైపు కేఎల్ రాహుల్ వికెట్ కీపర్‌గా, జస్ప్రీత్ బుమ్రా ప్రధాన బౌలర్‌గా టీమ్ కి బ్యాక్ బోన్ లా నిలిచే అవకాశం ఉంది.

టీమిండియా 2027 వరల్డ్ కప్ జట్టు అంచనా: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా.

# 21 ఏళ్లకే క్రికెట్‌కి గుడ్ బై.. ఆర్సీబీ కొత్త ఛైర్మన్‌గా ఆర్యమన్ బిర్లా.. ఎలా సాధ్యమైందంటే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలోనే ఓ సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. క్రికెట్ ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన టీమ్స్ లో ఒకటైన ఆర్సీబీ జట్టు చేతులు మారింది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఆధ్వర్యంలోని కన్సార్టియం సుమారు 1.78 బిలియన్ డాలర్ల (రూ.16 వేల కోట్లకు)కి ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది. బ్రిటన్‌కు చెందిన డయాజియో అనుబంధ సంస్థ 'యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్' నుంచి ఆర్సీబీ 100 శాతం వాటాను ఈ కన్సార్టియం దక్కించుకుంది. ఈ భారీ ఒప్పందంతో ఐపీఎల్ జట్ల విలువ ఒక్కసారిగా భారీగా పెరిగిపోయింది. ఈ మార్పు తర్వాత ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా కుమారుడు ఆర్యమన్ బిర్లా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. కాగా ఆర్యమన్ బిర్లా కేవలం వ్యాపార కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినే కాదు.. అతడికి క్రికెట్‌తో సంబంధం కూడా ఉంది. మధ్యప్రదేశ్ తరఫున ఫస్ట్-క్లాస్ క్రికెట్ ఆడిన అనుభవం ఆర్యమన్ కి ఉంది. ఈడెన్ గార్డెన్స్‌లో బెంగాల్ టీమ్ పై సెంచరీ చేసిన చరిత్ర అతడి పేరిట నమోదైంది. ప్రస్తుతం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్‌తో కలిసి గతంలో అతడు డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నాడు. ఆర్సీబీ కొత్త ఛైర్మన్ ఆర్యమన్ బిర్లా ప్రయాణం చాలా ఇంట్రెస్టింగ్ గా కొనసాగింది. 2018 ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు అతడ్ని రూ.30 లక్షలకు దక్కించుకుంది. కానీ అప్పుడు ఒక్క మ్యాచ్ కూడా ఆడే ఛాన్స్ రాలేదు.. దీంతో 2020లో తీవ్ర మానసిక ఒత్తిడితో క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతం ఇస్తూ తనను తాను అర్థం చేసుకోవడానికి ఆ బ్రేక్ తీసుకున్న ఆర్యమన్ బిర్లా.. ఇప్పుడు తన తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని ముందుకు నడిపిస్తున్నాడు. తాజాగా ఓ ఐపీఎల్ జట్టుని కొనుగోలు చేసి అధిపతిగా తిరిగి వచ్చాడు.

ఆర్సీబీ జట్టు కొనుగోలులో ది

ఆదిత్య బిర్లా గ్రూప్‌తో పాటు టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్, బోల్డ్ వెంచర్స్, బ్లాక్‌స్టోన్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ పార్టనర్స్ గా ఉన్నాయి. క్రీడలు, మీడియా, వ్యాపార రంగాలలో ఉన్న అనుభవంతో ఆర్సీబీని ప్రపంచస్థాయిలో నెంబర్ వన్ గా నిలబెట్టాలని ప్లాన్ చేస్తున్నారు. ఆర్సీబీ ఎదుగుదలలో భాగస్వామి కావడం తన అదృష్టమని ఆర్యమన్ బిర్లా ఇంస్టాగ్రామ్ వేదికగా తెలియజేశాడు.

# రియాన్ పరాగ్‌కి రాజస్థాన్ రాయల్స్ బిగ్ షాక్.. కొత్త కెప్టెన్‌గా అతడే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. 2026, మార్చి 24న ఈ జట్టు కొత్త యాజమాన్యం చేతిలోకి వెళ్లిపోయింది. ఇప్పటి వరకు మనోజ్ బదేలే నేతృత్వంలో ఉన్న ఈ ఫ్రాంచైజీని, కల్ సోమాని ఆధ్వర్యంలోని కన్సార్టియం కొనుగోలు చేసింది. గతంలో సుమారు రూ. 320 కోట్లకు కొనుగోలు చేసిన ఈ జట్టు, ఇప్పుడు ఏకంగా రూ. 15,280 కోట్లకు అమ్ముడైంది. ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన లావాదేవీలలో ఒకటిగా నిలిచింది.

**పూర్తి స్థాయి కెప్టెన్‌గా:**

యాజమాన్యంతో పాటు రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ కూడా మారారు. గత సీజన్ వరకు కెప్టెన్‌గా ఉన్న సంజూ శాంసన్, ట్రేడింగ్ ద్వారా చెన్నై సూపర్ కింగ్స్ కు వెళ్లడంతో.. రాజస్థాన్ యాజమాన్యం రియాన్ పరాగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. పరాగ్ గత సీజన్‌లో శాంసన్ అందుబాటులో లేనప్పుడు వైస్ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపించాడు. ఈసారి పూర్తి స్థాయి కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు.

**జైస్వాల్ కి కెప్టెన్సీ పగ్గాలు:**

సోషల్ మీడియాలో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్‌ను తొలగించి, యశస్వి జైస్వాల్‌ను నియమించనున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. కానీ ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదు.. రాజస్థాన్ ఫ్రాంచైజీ కెప్టెన్సీ మార్పు గురించి ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. 2026, మార్చి 25 ముంబైలో జరిగిన ఐపీఎల్ కెప్టెన్ల ఫోటోషూట్‌లో కూడా రియాన్ పరాగ్ పాల్గొని, ట్రోఫీతో ఫోటోలకు ఫోజులిచ్చారు. అయితే జైస్వాల్ రాజస్థాన్ రాయల్స్ స్టార్ ప్లేయర్, భవిష్యత్తులో కెప్టెన్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి మాత్రం పరాగ్ కెప్టెన్‌గా కొనసాగుతున్నారు. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు రాజస్థాన్ ఫ్రాంచైజీ జైస్వాల్‌ను రూ. 18 కోట్లకు, పరాగ్‌ను రూ14 కోట్లకు రిటైన్ చేసుకుంది.

**రాజస్థాన్ రాయల్స్ షెడ్యూల్:**

రియాన్ పరాగ్ నేతృత్వంలోని రాజస్థాన్ రాయల్స్ తమ ఐపీఎల్ 2026 ప్రయాణాన్ని మార్చి 30న చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌తో ప్రారంభించనుంది. అనంతరం ఏప్రిల్ 4, 7, 10 తేదీలలో వరుసగా గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లతో తలపడనుంది.

# సీనియర్ హీరోల యంగ్ స్ట్రాటజీ!

టాలీవుడ్ లో ఇప్పుడు ఒక సరికొత్త ట్రెండ్ నడుస్తోంది. ఒకప్పుడు సీనియర్ హీరోలు కేవలం అనుభవజ్ఞులైన దర్శకులతోనే పనిచేయడానికి మొగ్గు చూపేవారు. కానీ మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తమను తాము కొత్తగా ఆవిష్కరించుకోవడానికి సీనియర్ స్టార్లు యంగ్ డైరెక్టర్ల వైపు చూస్తున్నారు. ఈ యంగ్ స్ట్రాటజీ టాలీవుడ్‌లో సరికొత్త రికార్డులకు పునాది వేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి ఈ విషయంలో ముందు వరుసలో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతో 400 కోట్ల వసూళ్లు సాధించి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటారు. తాజాగా చిరంజీవి దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ కల్ట్ చిత్రం చేయడానికి రెడీ అవుతున్నారు. దర్శకుడిగా శ్రీకాంత్ కు ఇది మూడవ చిత్రం మాత్రమే. అయినా అన్నయ్య ఎక్కడా వెనక్కి తగ్గలేదు. తన మార్క్ హిట్ ఇస్తాడు? అనే నమ్మకంతో ముందుకెళ్తున్నారు. ఈ చిత్రాన్ని నేచురల్ స్టార్ నాని సమర్పిచడం అన్కనది మరో ఎత్తు. ఈ ఛాన్స్ తో చిరంజీవి కుర్ర హీరోలకు ఏమాత్రం తీసిపోని ఎనర్జీతో మరో సినిమా చేస్తున్నారని క్లారిటీ వచ్చేసింది. అలాగే నటసింహ నందమూరి బాలకృష్ణ కూడా పంథా మార్చుకున్నారు. వరుస హిట్లతో దూసుకుపోతున్న బాలయ్య తన 112వ సినిమా కోసం సరిపోదా శనివారం ఫేమ్ వివేక్ ఆత్రేయకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారంలో ఉంది. క్లాస్ కథలు రాసే వివేక్ ఆత్రేయ బాలయ్య కోసం ఓ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ క్రేజీ కాంబినేషన్ 2027 సమ్మర్ కానుకగా విడుదలయ్యే అవకాశం ఉంది. బాలయ్య మాస్ ఇమేజ్‌కు వివేక్ ఇంటెలిజెంట్ స్క్రీన్‌ప్లే తోడైతే బాక్సాఫీస్ వద్ద జాతరే. అక్కినేని నాగార్జున తొలి నుంచి కొత్త దర్శకులను ప్రోత్సహించడంలో ముందుంటారు. తాజాగా తన ప్రతిష్టాత్మక 100వ సినిమా బాధ్యతలను కోలీవుడ్ యంగ్ డైరెక్టర్ కార్తీక్ తంగవేలుకు అప్పగించిన సంగతి తెలిసిందే. దర్శకుడిగా కార్తీక్ కి పెద్దగా అనుభవం లేదు. తొలి సినిమా కూడా భారీ విజయం సాధించింది లేదు.

కానీ నాగ్, కార్తీక్ కథను, మేకింగ్ ను నమ్మి ముందుకెళ్తున్నారు. ల్యాండ్ మార్క్ చిత్రాన్నే కార్తీక్ చేతుల్లో పెట్టారంటే యంగ్ మేకర్ ని కింగ్ ఎంతగా నమ్ముతున్నారు? అన్నది అద్దం పడుతుంది. నాగ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయే చిత్రమవుతుందని అభిమానులంతా కాన్ఫిడెంట్ గా ఉన్నారు. విక్టరీ వెంకటేష్ కూడా ఈ యంగ్ డైరెక్టర్ల రేసులో వెనుకబడలేదు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఆదర్శ కుటుంబం పూర్తి చేసిన వెంటనే తన ఫేవరెట్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో మరోసారి చేతులు కలపనున్నారు. ఈ చిత్రంలో నందమూరి కళ్యాణ్ రామ్ కూడా ఒక కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. దగుబాటి - నందమూరి హీరోలను ఒకే తెరపై చూపించడం అనీల్ కు ఇదే తొలిసారి. 2027 సంక్రాంతికి ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌ను అందించబోతున్నారు. మొత్తానికి టాలీవుడ్ సీనియర్ హీరోలు తమ అనుభవాన్ని యంగ్ డైరెక్టర్ల కొత్త ఆలోచనలతో జోడించి బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఈ మార్పు కేవలం వసూళ్లకే కాకుండా తెలుగు సినిమా పరిధిని పెంచడానికి కూడా దోహదపడుతోంది.





**కర్లీ హెయిర్ మోడ్ ఆన్: ప్రకృతి పావని ఆత్మవిశ్వాసం & ఆకట్టుకునే అవతార్**



**బ్రౌన్ శాటిన్ గౌనులో ప్రణీత సుభాష్ టైమ్‌లెస్ గాంభీర్యాన్ని అందిస్తోంది**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965